ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

పెద్దపల్లి
జిల్లా వార్తలు
5★
మంగళవారం 7 మే 2024

ఈవీఎం కమిషనింగ్‌ను సమర్థవంతంగా పూర్తిచేయాలి 8లో..

రూ.9 కోట్లతో పోలీస్ క్వార్టర్ల నిర్మాణం 8లో..

రాముడికి, సనాతన ధర్మానికి కాంగ్రెస్ వ్యతిరేకం

- ఎస్సీ, ఎస్టీ, బీసీల రిజర్వేషన్లు తగ్గించింది కాంగ్రెస్సే
- రామగుండం ఎరువుల కర్మాగారాన్ని పునరుద్ధరించాం
- పెద్దపల్లి బీజేపీ జనసభలో జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా


జేపీ నడ్డాకు నాగలిని బహూకరిస్తున్న పార్టీ నాయకులు

పెద్దపల్లి, మే 6 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ రాముడికి, సనాతన ధర్మానికి వ్యతిరేకమని బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా ఆరోపించారు. గతంలో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల రిజర్వేషన్లలో కోత విధించి, ముస్లింలకు రిజర్వేషన్లు కల్పించింది కాంగ్రెస్ పార్టీయేనని, దానిని కోర్టు అడ్డుకుందన్నారు. రిజర్వేషన్ల విషయంలో రాహుల్‌గాంధీ తప్పుడు మాటలు మాట్లాడుతున్నారని, దళిత, ఆదివాసీ, బీసీలను దగా చేస్తున్నారని మండిపడ్డారు. మతం ఆధారంగా రిజర్వేషన్లు ఇవ్వకూడదని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాజ్యాంగంలో స్పష్టం చేశారని నడ్డా పేర్కొన్నారు. సోమవారం పెద్దపల్లి పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదనంలో బీజేపీ జన సభ జరిగింది. ఈ సభకు హాజరైన నడ్డా మాట్లాడుతూ పదేళ్లుగా కేంద్రంలో నరేంద్ర మోదీ నాయకత్వంలో స్థిరమైన, బలమైన, నిర్ణయాత్మకమైన ప్రభుత్వం కొనసాగుతున్నదన్నారు. 54 ఏళ్ల కాంగ్రెస్ పాలనలో దేశంలో దయనీయమైన పరిస్థితులను ప్రజలు చూశారని అన్నారు. మోదీ నాయకత్వంలో ఎన్‌డీఏ సర్కారు రాజనీతి, జవాబుదారీతనంతో పరిపాలన చేస్తున్నామన్నారు. ప్రస్తుతం దేశం స్వయం సమృద్ధి చెందిన దేశంగా మారిందని, సబ్ కా సాథ్, సబ్‌కా వికాస్ నినాదంతో ప్రపంచంలోనే అగ్రదేశంగా రూపొందింద న్నారు.


సభకు హాజరైన జనం

2014లో ప్రపంచంలో జీడీపీలో 11వ స్థానంలో ఉన్న దేశాన్ని మోదీ సర్కారు ఐదో స్థానంలోకి తీసుకు వచ్చిందన్నారు. రామగుండం లో ఫెర్టిలైజర్ ఫ్యాక్టరీని పునరుద్ధరించామని నడ్డా పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ సనాతన ధర్మానికి, రాముడికి వ్యతిరేకమైన పార్టీ అని ఆరోపించారు. రామజన్మభూమి ఊహాజనితమైనదని, రాముడికి సంబంధించి ఎలాంటి చారిత్రక ఆధారం లేదని కాంగ్రెస్ పార్టీ కోర్టులో వాదించిందని గుర్తు చేశారు. దేవుని కృప వల్ల కోర్టు రామజన్మభూమిపై స్పష్టమైన తీర్పు ఇచ్చిందన్నారు. ప్రజల ఆశీస్సుల వల్ల జనవరిలో రామ్‌జన్మభూమిలో విగ్రహ ప్రతిష్ఠ చేశామని తెలిపారు. అవినీతి, ఓటు బ్యాంకు రాజకీయాలు చేసే కాంగ్రెస్ పార్టీని ఓడించాలని, పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి శ్రీనివాస్ గొమాసేను గెలిపించాలని నడ్డా కోరారు.

● పెద్దపల్లిలో కుటుంబ పాలన అంతం చేయాలి..

పెద్దపల్లి టౌన్: పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గంలో కుటుంబ పాలనను అంతం చేయాలని బీజేపీ అభ్యర్థి శ్రీనివాస్ గొమాసే పిలుపునిచ్చారు. పదేళ్లుగా ప్రధాని నరేంద్ర మోదీ దేశ భక్తితో సేవకుడిగా పనిచేస్తూ దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ సన్నాసులు రిజర్వేషన్లను రద్దు చేస్తున్నారంటూ దుష్ప్రచారం చేస్తున్నారని, రాజ్యాంగం రాసిన డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌ను లాథూర్, ముంబాయిలో రెండుసార్లు ఓడించారని మండిపడ్డారు. దేశాన్ని 54 ఏళ్ల ఏలిన కాంగ్రెస్ పార్టీ రాజ్యాంగాన్ని సరిగ్గా అమలు చేయలేదని అన్నారు. పెద్దపల్లి నియోజకవర్గంలో 40 ఏళ్లుగా స్థానికేతరులు ఇక్కడి ప్రజల చేత ఓట్లు వేయించుకుని ఆ అధికారంతో ఇతర రాష్ట్రాల్లో పరిశ్రమలు నెలకొల్పి ఇక్కడ అభివృద్ధిని మరిచారని విమర్శించారు. తాను గెలిస్తే సింగరేణి కార్మికులకు ఐటీ రీయింబర్స్‌మెంట్ ఇప్పిస్తానని, మైనింగ్ ఇంజినీరింగ్ కళాశాల, నవోదయ, కేంద్రీయ విద్యాలయాలు తీసుకు వస్తానని హామీ ఇచ్చారు. ఎంపీ వెంకటేశ్ నేత మాట్లాడుతూ ఈ దేశానికి రక్షణ నరేంద్ర మోదీ అని అన్నారు. పదేళ్లుగా అవినీతి రహిత పాలనను మోదీ అందిస్తున్నారు. 3.5 ట్రిలియన డాలర్ల జీడీపీని సాధించి ప్రపంచంలోనే దేశాన్ని 5వ స్థానంలో నిలిపారని అన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీ నేతలు రిజర్వేషన్లపై దుర్మార్గంగా దుష్ప్రచారం చేస్తున్నాయని మండిపడ్డారు. ఈ నియోజకవర్గంలో వివేక్ కుటుంబ పాలననలు అంతమొందించాలని పిలుపునిచ్చారు. బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుగ్యాల ప్రదీప్ కుమార్ మాట్లాడుతూ ఆరు గ్యారంటీలతో కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందన్నారు. ఎస్సీ మోర్చా జాతీయ కార్యదర్శి ఎస్ కుమార్ మాట్లాడుతూ భారత రాజ్యాంగాన్ని రచించిన డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌ను కాంగ్రెస్ పార్టీ అవమానపరిచందన్నారు. రిజర్వేషన్లపై కాంగ్రెస్ తప్పుడు ప్రచారం చేస్తున్నదన్నారు. సభలో పార్టీ జిల్లా అధ్యక్షుడు చంద్రుపట్ల సునీల్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ రాంచందర్ రావు, మాజీ ఎమ్మెల్యేలు రాంరెడ్డి, శ్రీదేవి, పార్టీ నాయకులు రఘునాథరావు, నరేందర్‌రెడ్డి, వెంకటేశ్ గౌడ్, సుహాసిని రెడ్డి, నారాయణ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో వ్యవస్థలన్నీ నిర్వీర్యం

- బీజేపీ అంటే మోదీ, అమిత్ షా లే - మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు


సుల్తానాబాద్‌లో మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు

సుల్తానాబాద్, మే 6: తెలంగాణా రాష్ట్రంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వ పదేళ్ల పాలనలో వ్యవస్థలన్నీ నిర్వీర్యం అయ్యాయని ను అన్నింటినీ ధ్వంసం చేశారని రాష్ట్ర ఐటి పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీదర్ బాబు అన్నారు. పెద్దపల్లి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గడ్డం వంశీకి మద్దతుగా ఆయన సోమవారం సుల్తానాబాద్ లో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. పూసాల రోడ్డులో నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో కార్యకర్తలు, ప్రజలను ఉద్దేశించి మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడారు. రాష్ట్రంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం అనేక వ్యవస్థలను ధ్వంసం చేశారని మరోసారి ఓట్ల కోసం ప్రజల ముందుకు ఎలా వస్తారన్నారు. పెద్దపల్లిలో బీజేపీ జాతీయ అధ్యక్షుడు నడ్డా చేసిన ఆరోపణలు ఖండించారు. వెంకటస్వామి పెద్దపల్లి ప్రాంతంలో రాజీవ్ రహదారిని సికింద్రాబాద్ నుంచి మంచిర్యాల, చెన్నూరు నియోజకవర్గాల వరకు పొడి గించిన వ్యక్తి కాకా వెంకటస్వామి అని అన్నారు. సింగరేణిని కాపాడడంలో, అటవీ శాఖ అనుమతులు తెచ్చి మారుమూల గ్రామాలకు రోడ్లు వేయించారన్నారు. బీజేపీని ఒక పక్క మోదీ, మరో పక్క అమిత్‌షా లు మాత్రమే నడిపిస్తున్నారన్నారు. కాంగ్రెస్ గ్యారంటీ అని మనమంటే వారేమో మోదీ గ్యారంటీ అంటున్నారన్నారు. మోదీ అదానికి అంబానీలకు మాత్రమే గ్యారంటీ ఇస్తారని విమర్శించారు. దేశాన్ని లూటీ చేసి ఇతర దేశాలకు తరలించుకుపోయిన వారికి మద్దతు ఇస్తున్న బీజేపీకి రాహుల్ గాంధీ గురించి మాట్లాడే నైతిక హక్కు లేదని మంత్రి స్పష్టం చేశారు. త్యాగాలతో కూడిన రాహుల్ గాంధీ కుటుంబంపై ఎందుకింత ఈర్ష్య అంటూ నడ్డాను ప్రశ్నించారు. ఇరవై కోట్ల మందికి ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పిన బీజేపీ కేవలం ఐదు లక్షల మందికి మాత్రమే ఇచ్చి యువతను మోసం చేసిందని ఆరోపించారు. బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని మారుస్తుందని, ఈ ప్రాంత ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలు ప్రజలు ఆలోచించి ఓటు వేయాలని కోరారు. రిజర్వేషన్లు ఎత్తి వేసే కుట్ర జరుతుతోందని ఆరోపించారు. పదేళ్ల కాలంలో బీజేపీ ప్రభుత్వం పెద్దపల్లికి ఏం చేశారని ప్రశ్నించారు. ఒక్క నవోదయ సైనిక్ స్కూల్ ఇవ్వని బీజేపీకి ఓటు అడిగే నైతిక హక్కు లేదన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణను ఆదరించి ఓటు వేసి గెలిపించాలని ప్రజలను కోరారు. బీఆర్ఎస్, బీజేపీలకు ఓటు వేస్తే వృదా అవుతాయని ఆలోచించి చేతి గుర్తుకు ఓటు వేయాలని పిలుపునిచ్చారు. గడ్డం వంశీకృష్ణ ప్రజలకు సేవ చేసే లక్ష్యంతో ముందుకు వచ్చారన్నారు. కార్యక్రమంలో చెన్నూర్, పెద్దపల్లి ఎమ్మెల్యేలు వివేక్ వెంకటస్వామి, విజయరమణారావు, కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ, కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

● ఆరు గ్యారంటీలను నెరవేరుస్తాం...

గోదావరిఖని: కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలను నెరవేర్చి తీరుతుందని, జూన్ 3 తరువాత ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తుందని రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. సోమవారం రాత్రి గోదావరిఖని సీతానగర్ మెయిన్ రోడ్డులో మేయర్ బంగి అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన కార్నర్ మీటింగ్‌లో ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ, ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్‌తో కలిసి శ్రీధర్‌బాబు ప్రసంగించారు. కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో బీఆర్ఎస్ పదేళ్ల అధికారంలో ఉండి ప్రజలకు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేయలేదని, పైగా ప్రజలపై భారాలు మోపారన్నారు. మార్పు కోరుకున్న ప్రజలు కాంగ్రెస్‌ను గెలిపించారన్నారు. ఎన్నికల కోడ్ ముగిసిన తరువాత ఇందిరమ్మ ఇల్ల పథకం అమలు చేస్తామని శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. రామగుండంలో గతంలో దోచుకున్న ప్రభుత్వ భూములను పేదలకు ఉపయోగపడేలా కబ్జాదారుల వద్ద నుంచి స్వాధీనపర్చుకుంటున్నారని, ఈ విషయంలో ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ జిల్లా యంత్రాంగాన్ని కూడా సమన్వయపరుస్తున్నారన్నారు. ఇందిరమ్మ పథకం క్రింద సింగరేణి ఖాళీ స్థలాల్లో గృహ నిర్మాణం చేపట్టేందుకు చర్యలు చేపడుతున్నట్లు శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. రామగుండానికి ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులు ఇస్తుందని, రామగుండాన్ని ప్రణాళికబద్ధంగా అభివృద్ధి చేసి మోడల్ సిటీగా తీర్చిదిద్దుతామన్నారు. కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణను ఎన్నికల్లో గెలిపిస్తే యువత ఉపాధికి ఎంతో కృషి చేస్తారని శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ మాట్లాడుతూ కార్మిక సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని, కాంట్రాక్టు కార్మికులకు వేతనాలు పెంచేలా చర్యలు తీసుకుంటామన్నారు. కాంగ్రెస్ పార్లమెంట్ అభ్యర్థి వంశీకృష్ణ మాట్లాడుతూ తనను గెలిపించి పార్లమెంట్‌కు పంపితే ఈ ప్రాంతంలో యువత ఉపాధి కల్పించేలా కృషి చేస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్, నాయకులు బొంతల రాజేష్, మహంకాళిస్వామి, కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.


గోదావరిఖనిలో మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ

కాంగ్రెస్‌లో చేరిన జడ్పీ వైస్ చైర్‌పర్సన్ రేణుక

సుల్తానాబాద్: పెద్దపల్లి జడ్పీ వైస్ చైర్‌పర్సన్ రేణుక రాజనర్సు బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి సోమవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. సుల్తానాబాద్ పట్టణంలో కాంగ్రెస్ పార్టీ పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీకి మద్దతుగా నిర్వహించిన కార్నర్ మీటింగ్ లో పాల్గొన్న మంత్రి శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యే విజయరమణారావు సమక్షంలో రేణుక కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీ కండువా కప్పి పార్టీలో చేర్చుకున్నారు.

● ఎంపీగా గెలిపిస్తే అభివృద్ధి చేసి చూపిస్తా

మందమర్రిరూరల్: పార్లమెంట్ ఎన్నికల్లో తనను గెలిపిస్తే అభివృద్ధి చేసి చూపిస్తానని పెద్దపల్లి పార్లమెం ట్ కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ పేర్కొన్నారు. పొన్నారం, వెంకటాపూర్ గ్రామాల్లో ఉపాధి హామీ కూలీ లను కలిసి ఓట్లు వేయాలని కోరారు. కార్యక్రమంలో గండె రాంచందర్, ఒడ్నాల కొముర య్య, నీలయ్య తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో తాగునీటి కొరత లేకుండా చూడాలి

ఎంపీపీ నూనేటి సంపత్


సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ సంపత్

కాల్వశ్రీరాంపూర్, మే 6: గ్రామంలో తాగునీటి కొరత లేకుండా చూడాలని ఎంపీపీ నూనెటి సంపత్ అధికారులను కోరారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయం లో ఎంపీపీ నూనెటి సంపత్ ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు పలు అంశాలపై చర్చించగా ప్రజాప్రతినిధులు ఆయా సమస్యలకు అధికారులను నిలదీశారు. ఈ సందర్భంగా ఎంపీపీ నూనెటి సంపత్ మాట్లాడుతూ ఎండ తీవ్రత ఎక్కువ ఉన్నందున ఉపాధిహామీ కూలీలు ఉదయాన్నే పనులకు వెళ్లి తొందరగా పని ముగించుకొని ఇంటికి వెళ్లాలన్నారు. ఉపాధిహామీ పనులు జరిగే స్థలాల్లో కూలీలకు ఇబ్బందులు కలకుండా తగు ఏర్పాటు చేయాలన్నారు. ఎండాకాలంలో గ్రామాల్లో తాగునీటి కొరత లేకుండా అధికారులతో ఏర్పాటు చేయాలన్నారు. వచ్చే వానాకాలంలో హరితహారం కోసం నర్సరీలో మొక్కలు పెంచాలన్నారు. హరిత తెలంగాణగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో రామ్మోహన్‌చారి, ఎంపీటీసీలు, అధికారులు తదితరులు ఉన్నారు.

మృతుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలి

సుల్తానాబాద్, మే 6: మండలంలో ట్రాక్టర్ బోల్తా పడిన సంఘటనలో మృతిచెందిన కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఎం పెద్దపల్లి ఏరియా కార్యదర్శి సీపల్లి రవీందర్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. చిన్నబొంకూరు గ్రామానికి చెందిన మహిళ కూలీలు రాజమ్మ, లక్ష్మి, వైష్ణవిలు చనిపోయారని మృతుల కుటుంబాలకు ప్రభుత్వం వెంటనే పదిహేను లక్షల రూపాయలను ఒక్కొక్కరికి పరిహారంగా ప్రకటించాలని ఆయన అన్నారు. గాయపడిన వారికి తక్షణమే లక్ష చొప్పున అందించాలని డిమాండ్ చేశారు.

ఘనంగా ప్రపంచ నవ్వుల దినోత్సవం

కోల్‌సిటీటౌన్, మే 6: స్మైల్ ప్లీజ్ లాఫింగ్ క్లబ్ ఆధ్వర్యంలో గోదావరిఖని మార్కండేయకాలనీలో ఆదివారం రాత్రి ప్రపంచ నవ్వుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన హాస్యవల్లరి కార్యక్రమం అలరించింది. నిత్య జీవితంలో హాస్యం ప్రాధాన్యాన్ని వివరించారు. క్లబ్ అధ్యక్షుడు మేజిక్ రాజా అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో తానిపర్తి గోపాల్‌రావు, దయానం ద్ గాంధీ, అమరేందర్, ఉపేందర్, చంద్రపాల్, గట్టయ్య, మూల శంకర్, కుమార్, దేవి లక్ష్మీనర్సయ్య, రాజు, లెనిన్, మేజిక్ హరి, వేణు, అంజిబాబు, చంద్రశేఖర్, పోషం, సత్యనారాయణ పాల్గొన్నారు.

వైభవంగా శివపార్వతుల కల్యాణం

పాలకుర్తి, మే 6: మండలం పరిధిలోని పుట్నూర్ గ్రామంలో సోమవారం శివపార్వతుల కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. స్థానిక గంగపుత్రుల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో విగ్రహదాతలైన కొండ సరోజనరాజయ్య దంపతులతో పాటు బింగి లక్ష్మి రాములు దంపతులు పూజలో పాల్గొన్నారు. బింగి వెంకటి, బింగి రమేష్, బోరే గట్టయ్య, పల్లికొండ తిరుపతి, నరేష్, మల్లేష్, బోరే రాజయ్య, కొమురయ్య, సాయి, సురేష్ పాల్గొన్నారు.

బీజేపీ, బీఆర్ఎస్ ప్రజలకు చేసిందేమీ లేదు

ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు

కాల్వశ్రీరాంపూర్/ఓదెల, మే 6: బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు ప్రజలకు చేసిందేమీ లేదని, కాంగ్రెస్ ప్రభుత్వంతోనే ప్రజలకు న్యాయం జరుగుతుందని పెద్దపెల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. కాల్వశ్రీరాంపూర్ మండలంలోని పెగడపల్లి, కునారం గ్రామాల్లో, ఓదెల మండలం కొలనూర్, గోపరపల్లి గ్రామాల్లో పెద్దపల్లి పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణకు మద్దతుగా ఉపాధి హామీ కూలీల వద్ద సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రాహుల్‌గాంధీ ప్రవేశపెట్టిన ఐదు గ్యారెంటీలను వివరిస్తూ కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి గడ్డం వంశీకృష్ణ అధిక మెజార్టీతో గెలిపించాలని వారు కోరారు. కునారం గ్రామంలో వివిధ పార్టీలకు చెందిన నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరగా విజయరమణారావు పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ వస్తేనే సబ్బండ వర్గాలకు న్యాయం జరుగుతుందన్నారు. ఇందిరమ్మ రాజ్యం కోసం ప్రజలు వేచి చూస్తున్నారని, త్వరలోనే రాహుల్‌గాంధీ ప్రధాని కావడం ఖాయమన్నారు. వచ్చే పంద్రాగస్టు లోపు రైతులకు రెండు లక్షల రుణమాఫీ చేస్తామన్నారు. వచ్చే వానకాలం పంట నుంచే 500 రూపాయలు రైతులకు బోనస్ ఇస్తామన్నా రు. పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి అధిక మెజార్టీతో గెలిపించాలని వారు కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గోపగోని సారయ్య గౌడ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గజనవేన సదయ్య, నాయకులు ఆరెల్లి రమేష్, డొంకేనా మొగిలి, తుల మనోహర్రావు మాదాసి సతీష్ పులి ఇంద్రకరణ్ రెడ్డి, శివరామకృష్ణ అల్లం దేవేందర్, సాధనవేన కొమురయ్య, జంగా రమణారెడ్డి, సబ్బని రాజమల్లు, బంగారు రమేష్, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


కాల్వశ్రీరాంపూర్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయరమణారావు

● బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి చేరికలు..

ఎలిగేడు: మండలంలోని శివపల్లిలోని ఎమ్మెల్యే విజయరమణారావు నివాసంలో పలువురు బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ పార్టీలో సోమవారం చేరారు. ఓదెల మాజీ సర్పంచ్ బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఆకుల మహేందర్ కాంగ్రెస్‌లో చేరగా పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు ఆయనకు కండువా కప్పి పార్టీకి ఆహ్వానించారు. ఆయన సమక్షంలో నాయకులు వంగ రాజమల్లు, పందేనా నర్సింగం, పిట్టల రామచంద్రం, మంద కృష్ణమూర్తి, తుడి రాజయ్య, ప్రవీణ్, కానుగంటి శంకరయ్య, మ్యాడగోని సంతోష్‌గౌడ్, అల్లం అజ్జిద్, బోడకుంట శివయ్య, రవికంటి ప్రభాకర్, ఓదెల గౌడ సంఘం అధ్యక్షుడు పచ్చిమట్ల శ్రీనివాస్‌గౌడ్, ఒల్లాల శంకరయ్య, మార్క సాదనందం, నాగపురి రవికుమా ర్, శ్రీనివాస్, భూసారపు కనకయ్య, పడాల మల్లయ్య, ఓదెల గ్రామ ముదిరాజ్ సంఘం మాజీ అధ్యక్షుడు తీగల సాదనందం, ఓదెలు, స్వామి, శంకరయ్య, తిరుపతి, అంజి, దస్తగిరి, నూతి సత్యనారాయణ పలువురు బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలకు కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఎమ్మెల్యే ఆహ్వానించారు. కాంగ్రెస్ అభ్యున్నతికి కృషిచేయాలని వారిని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.


కాంగ్రెస్ కండువా కప్పుతున్న విజయరమణారావు

ఉపాధి కూలీల చుట్టూ నేతల ప్రదక్షిణలు




మల్యాలలో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు, తాటిపల్లిలో ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులు

మల్యాల, మే 6: పోలింగ్ తేదీ సమీపిస్తుండడంతో పార్టీల నేతలు గ్రామాల్లో లోక్‌సభ ఎన్నికల ప్రచారం ముమ్మరం చేశారు. ఎండలు దంచి కొడుతుండడంతో ఉదయం పూటే ఉపాధి హామీ పనులకు వెలుతున్న మహిళల వద్దకే నాయకులు పరుగెడుతున్నారు. గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనుల వద్దకు వెళ్లి ఎన్నికల ప్రచారం చేస్తున్నారు. వారం రోజులుగా కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు పోటీలు పడి ఉపాధి పనుల వద్ద ప్రచారం చేపట్టారు. ఎండ వేడి నివారణకు మజ్జిగ పాకెట్లు అందిస్తూ పనిలో పనిగా తమ పార్టీ అభ్యర్థికి ఓటు వేయాలని అభ్యర్థిస్తున్నారు. అన్ని గ్రామాల్లో రోజుకో పార్టీ నాయకులు ప్రచారం చేస్తున్నారు. కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు ఇప్పటికే అన్ని గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనుల వద్ద ప్రచారం పూర్తి చేయగా సాయంకాలం వేళలో ఇంటింటా ప్రచారం చేస్తున్నారు.

● సభలకు వెళితే రూ. 200

కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు తమ సభలకు వచ్చే మహిళలకు 200 రూపాయల చొప్పున అందిస్తున్నారు. ఉదయం ఉపాధి పనులకు వెలుతున్న మహిళలు సాయంత్రం ఎన్నికల సభలు, సమావేశాలకు వెళుతున్నారు. దీంతో వారికి కొంత ఉపాధి లభిస్తోంది.

మాజీ సీఎం కేసీఆర్ బస్సు తనిఖీ



కేసీఆర్ వాహనాన్ని తనిఖీ చేస్తున్న పోలీసులు

జగిత్యాలరూరల్, మే 6: మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ వాహనాన్ని పోలీసులు సోమవారం రాత్రి తనిఖీ చేశారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా జగిత్యాల నుంచి నిజామాబాద్ రోడ్ షోకి వెళ్తున్న క్రమంలో జగిత్యాల రూరల్ మండలం చల్‌గల్ వద్ద మాజీ సీఎం కేసీఆర్ ప్రయాణిస్తున్న బస్సును పోలీసులు తనిఖీ చేశారు. పోలీసు అధికారులకు కేసీఆర్ సహకరించారు.

గడి స్థలంలో అక్రమ నిర్మాణాలు తొలగించాలి

● కలెక్టరేట్‌కు తరలి వచ్చిన చల్‌గల్ గ్రామస్థులు



వినతిపత్రాన్ని చూపుతున్న చల్‌గల్ గ్రామస్థులు

జగిత్యాల, మే 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చల్‌గల్ గడి స్థలంలోని అక్రమ నిర్మాణాలను తొలగించాలని డిమాండ్ చేస్తూ గ్రామస్థులు జగిత్యాలలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయానికి తరలివచ్చారు. సోమవారం పట్టణంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో అధికారులకు వినతి పత్రాన్ని అందించారు. గడి ముందు గల ఖాళీ స్థలంలో ఇటీవల ఓ వ్యక్తి అక్రమ నిర్మాణం ప్రారంభించాడన్నారు. గ్రామానికి చెందిన ఉమ్మడి ఆస్తి అయిన గడి ముందు గల స్థలాన్ని ఆక్రమించడం సరైంది కాదని తెలిపారు. గడి ఎదుట ఉన్న ఖాళీ స్థలంలోని అన్ని రకాల నిర్మాణాలు, కట్టడాలు తొలగించాలని కోరుతూ పలువురు గ్రామస్థుల సంతకాలతో కూడిన వినతిప్రతం సమర్పించారు.

దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలి

● కోరుట్ల ప్రభుత్వ ఆసుపత్రి ఎదుట వైద్యులు, సిబ్బంది నిరసన



పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న గెజిటెడ్ డాక్టర్ అసోసియేషన్ సభ్యులు

కోరుట్ల మే 6: పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో చోటు చేసుకున్న సంఘటనపై సోమవారం వైద్యులు, సిబ్బంది కోరుట్ల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసి ఆసుపత్రి అవరణలో నిరసన తెలిపారు. వైద్యులు సిబ్బంది చేస్తున్న నిరసనకు మద్దతుగా తెలంగాణ గవర్నమెంట్ గెజిటెడ్ డాక్టర్ అసోసియేషన్, ఐఎం అసోసియేషన్ సభ్యులు మద్దతు పలికారు. పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో రెండు రోజుల క్రితం డాక్టర్, సిబ్బందిపై కొందరు వ్యక్తులు దాడి చేశారు. ఈ దాడికి నిరసనగా వైద్యులు, సిబ్బంది ఆసుపత్రి నుంచి ర్యాలీ నిర్వహించి కోరుట్ల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతు డ్యూటీలో ఉన్న వైద్యులు సిబ్బందిపై దాడి చేసిన వారిని గుర్తించి వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఓపీ సేవలను రద్దు చేసి ఆందోళన నిర్వహించారు. ప్రభుత్వ ఆసుపత్రిని జిల్లా వైద్యాధికారి శ్రీధర్, డీసీహెచ్ఎస్ జిల్లా అధికారిణి సురక్షతన సందర్శించారు. జరిగిన సంఘటన వివరాలు తెలుసుకున్నారు. ఈ విషయం ఉన్నత అధికారులకు నివేదించి దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

రామయ్యపల్లెలో చోరీ

ధర్మపురి,మే6: మండలంలోని రామయ్యపల్లె గ్రామంలో ఊరడి జయకర్ అనే వ్యక్తి ఇంటిలో చోరీ జరిగినట్లు ఆలస్యంగా తెలిసింది. రెండు రోజుల క్రితం జయకర్ రాత్రి వేళలో తన ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలిసి ఆరు బయట నిద్రించాడు. గుర్తు తెలియని వ్యక్తులు వచ్చి ఇంటి తలుపులు తెరచి 10 వేలు నగదు, 45 తులాల వెండి ఆభరణాలు, ఐదు తులాల బంగారు ఆభరణాలు దొంగిలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

కరీంనగర్ రూరల్, మే6: మండలంలోని బొమ్మకల్‌లో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ కరీంనగర్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో వయోవృద్ధులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు.ఈ సందర్భంగా 102 మంది వృద్ధులకు బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ పెండ్యాల కేశవరెడ్డి సభ్యులు కోల అన్నారెడ్డి, మెడికల్ ఆఫీసర్ ఎం ఎల్ఎన్‌రెడ్డి, ఊట్కూరు రాధాకృష్ణ పాల్గొన్నారు.

కొడిమ్యాలలో గుడిసె దగ్ధం



దగ్ధమైన గుడిసెను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

కొడిమ్యాల, మే 6: మండల కేంద్రానికి చెందిన దండుగుల శేఖర్‌కు చెందిన గుడిసె సోమవారం ఉదయం దగ్ధమైంది. గుడిసెలోని నిత్యావసర సరుకులు, వంట సామగ్రి, బట్టలు కాలిపోయాయని బాధితుడు తెలిపాడు. చొప్పదండి ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యం కొడిమ్యాలలో దగ్ధమైన గుడిసెను పరిశీలించారు. శేఖర్ కుటుంబ సభ్యులను పరామర్శించి ఐదు వేల రూపాయలు అందించారు. ఎమ్మెల్యే వెంట కాంగ్రెస్ మండల అ. ధ్యక్షుడు నారాయణగౌడ్, కేడీసీసీబీ మాజీ డైరెక్టర్ మల్లికార్జున్‌రెడ్డి, కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రెజిడెంట్ జీవన్‌రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ రాజనర్సింగరావు ఉన్నారు.

రాజాపూర్‌లో పొలం దగ్ధం

రామగిరి, మే 6: మండలంలోని రాజాపూర్ గ్రామానికి చెందిన ఎలువాక సంపత్‌కుమార్‌కు చెందిన అర ఎకరం పొలం ప్రమాదవశాత్తు దగ్ధమైంది. బురదగా ఉండడంతో కోపించిన వరిని కల్లంలో కుప్పగా పేర్చి ఉంచారు. సోమవారం అగ్ని ప్రమాదంలో వరికుప్ప దగ్ధమైంది. ఈ ప్రమాదంలో సుమా రు 20 బస్తాల వడ్లు అగ్ని ఆహుతి అయ్యాయని రైతు తెలిపాడు.

పోలీసు తనిఖీల్లో నగదు పట్టివేత

కరీంనగర్ క్రైం, మే 6: కరీంనగర్‌లో ఆదివారం అర్ధరాత్రి నుంచి నిర్వహించిన తనిఖీల్లో ఇద్దరు వ్యక్తుల వద్ద 5.32 లక్షల రూపాయలు పట్టుకున్నట్లు కరీంనగర్ మూడో ఠాణా సీఐ జాన్‌రెడ్డి తెలిపారు. నగరంలో నిర్వహించిన వాహనాల తనిఖీల్లో ఎలాంటి ఆధారాలు లేకుండా తీసుకువెళుతున్న డబ్బులను వేర్వేరు చోట్ల స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. సుభాష్‌నగర్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా తీగలగుట్టపల్లికి చెందిన ఒడ్నాల రవీందర్ వద్ద 3.32 లక్షల రూపాయలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వావిలాలపల్లి ట్రినిటీ గర్ల్స్ జూనియర్ కళాశాల వద్ద వాహనాల తనిఖీల్లో గౌతమి నగర్‌కు చెందిన పింగిళి విష్ణువర్ధన్‌రెడ్డి వద్ద నుంచి రెండు లక్షల రూపాయ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వారివద్ద తగి ఆధారాలు లేకపోవడంతో నగదును సీజ్ చేసి సీజర్ కమిటీకి స్వాధీనం చేశామని తెలిపారు.

● సైదాపూర్: మండలంలోని ఎలబోతారం గ్రామంలో హుజూరాబాద్ రూరల్ సీఐ వెంకట్ ఆధ్వర్యంలో సోమవారం వాహనాల తనిఖీ నిర్వహించారు. తనిఖీలో 1.2 లక్షల నగదు పట్టుకు న్నట్లు ఎస్ఐ జన్ను ఆరోగ్యం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. బెజ్జంకికి చెందిన శ్రీనివాస్‌రెడ్డి అనే వ్యక్తి ఎటువంటి ఆధారాలు లేకుండా 1.2 లక్షల నగదు తీసుకెళుతుండగా పట్టుకున్నట్లు తెలిపారు. ఈ నగదును సీజ్ చేశామన్నారు.

● జగిత్యాల టౌన్: జగిత్యాల జిల్లా కేంద్రంలో సోమవారం రాత్రి పోలీసులు విస్తృత తనిఖీలు నిర్వహించారు. పట్టణంలోని కొత్త బస్టాండ్, పాత బస్టాండ్, మంచినీళ్ల బావి, బైపాస్ రోడ్ తదితర ప్రాంతాల్లో పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు. పలువురి వద్ద నుంచి ఎటువంటి ఆధారాలు లేకుండా తీసుకెళుతున్న ఐదు లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. మంచిర్యాల ప్రాంతానికి తరలిస్తున్న టీవీలు, ఫ్రిజ్‌లను సీజ్ చేశారు. ఎలాంటి పత్రాలు లేని వాహనాలకు జరిమానాలు విధించారు. ఈ తనిఖీల్లో సీఐ వేణు గోపాల్. ఎస్సైలు నరేష్, మన్మధరావు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

ఎండపల్లి, మే6: బతుకుదెరువు కోసం వెళ్లిన ఓ యువకుడు విద్యుదాఘాతంతో మృతి చెందాడు. మృతుడి బంధువులు తెలిపిన ప్రకారం.. ఎండపల్లి మండలం మారేడుపల్లి గ్రామానికి చెందిన దోనిపెల్లి హరికృష్ణ (28) అలియాస్ మనోజ్ కుమార్ జయశంకర్ జిల్లా మల్హర్ మండలం రుద్రారం గ్రామంలోని మెగా కంపెనీలో డ్రైవరుగా పనిచేస్తున్నాడు. పని వద్ద ఉదయం ట్రాక్టర్‌తో వ్యవసాయ బావి వద్దకు నీరు తీసుకురావడానికి వెళ్లాడు. నీరు పడుతుండగా నీటి ట్యాంకర్ ఎంత వరకు నిండిందో చూద్దామని ట్యాంకర్ పైకి ఎక్కాడు. కరెంట్ తీగ తగిలి విద్యుదాఘాతంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడిని పోస్ట్‌మార్టమ్ కోసం జయశంకర్ జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. మృతుడి మరణ వార్తతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

నీటిలో మునిగి గొర్రెల కాపరి మృతి

బోయినపల్లి, మే 6: నీటిలో మునిగి గొర్రెల కాపరి మృతి చెందిన సంఘటన బోయినిపల్లి మండలం కొదురుపాక గ్రామంలో సోమవారం జరిగింది. పోలీసులు తెలిపిన ప్రకారం.. చందుర్తి మండలం జోగాపూర్‌కు చెందిన చిత్తరి పుల్లయ్య (20) అతని తల్లి, చెల్లితో సహా వేములవాడలో నివాసముంటున్నారు. కాగా పుల్లయ్య గత 6 నెలల నుంచి బోయినిపల్లి మండలం కొదురుపాకలోని కల్లెం రాజయ్య దగ్గర గొర్రెల కాపరిగా పనిచేస్తున్నాడు. ప్రతి రోజు ఉదయం గొర్రెలను తోలుకుని మేపడానికి మిడ్ మానేర్ బ్యాక్ వాటర్ వైపు వెళ్లి అక్కడే ఈత నేర్చుకుంటున్నాడు. ఎప్పటిలాగే సాయిలు అనే మరో గొర్రెల కాపరితో కలిసి మిడ్ మానేర్ వైపు వెళ్లి ఈత కొడుతూ స్నానం చేయడానికి నీళ్లలోకి దిగాడు. అక్కడే పూడిక ఉండటంతో అందులో కురుకుపోయాడు. మృతుడు పుల్లయ్య ఎంతకు రాకపోవడంతో పైన ఉన్న సాయిలు గ్రామంలోకి వెళ్లి కొందరు గ్రామస్తులను తీసుకువచ్చాడు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని వాటర్ గుంతలో గాలించి పుల్లయ్య మృతదేహం బయటకు తీసి పోస్టుమార్టం కు పంపించారు. మృతుని తల్లి వజ్రమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ మురళి తెలిపారు.

ఏటీఎంలో చోరీకి యత్నం

- పోలీసులకు చిక్కిన దొంగలు

కోరుట్ల మే 6: పట్టణంలోని కొత్త బస్టాండ్ ప్రాంతంలో ఉన్న ఏటీఎంలో ఆదివారం రాత్రి చోరీకి యత్నించారు. అదే సమయంలో మొబైల్ పార్టీ పోలీసు గమనించి దొంగలను పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. మెదట పట్టణంలోని కొత్త బస్టాండ్ ప్రాతంలో ఉన్న శ్రీలక్ష్మి వైన్స్ వద్ద ఉన్న సీసీ పుటేజీలను ధ్వంసం చేసి వైన్స్ షెటర్లకు ఉన్న తాళాలు పగులగొట్టే ప్రయత్నం చేయగా అవి రాక పోవడంతో అక్కడే ఉన్న ఏటీఎంలో చోరీకి యత్నించారు. ఏటీఎంలో సీసీ పుటేజీ ధ్వంసం చేసి మిషన్ పూర్తిగా ధ్వంసం చేసి దానిలో ఉన్న డబ్బులను తీసే ప్రయత్నం చేసారు. అదే సమయంలో మెట్‌పల్లి ఎస్ఐ చిరంజీవి నేషనల్ హైవేపై పెట్రోలింగ్ చేస్తున్నాడు. ఎస్సై ఆ ప్రాంతానికి రావడంతో ఏటీయం వద్ద ఇద్దరు వ్యక్తులు కనపడడంతో అక్కడి వెళ్లి పరిశీలించాడు. ఏటీయం మిషన్ ధ్వసంమై చోరీకి యత్నించినట్లు గుర్తించారు. ఏటీయంలో ఉన్న వారు పారిపోవడానికి ప్రయత్నం చేయగా వారిని పట్టుకోని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కాగా వారు మధ్యప్రదేశ్‌కు చెందిన వ్యక్తులుగా పోలీసులు గుర్తించారు. పట్టణంలో మామిడి కాయ దుకాణంలో కూలి పని చేయడానికి వచ్చినట్లు పోలీసులు గుర్తించారు. మద్యం మత్తులో ఉండి దొంగతనాలు పాల్పడుతుంటారని పోలీసు తెలిపారు. ఏటీఎం అధికారి శ్రీనివాస్‌రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు కోరుట్ల ఎస్ఐ కిరణ్ తెలిపారు.

రూ.7వేలు పలికిన పత్తి ధర

జమ్మికుంట రూరల్, మే 6: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర రూ.7వేలు పలికింది. సోమవారం మార్కెట్ యార్డుకు 15మంది రైతులు 159క్వింటాళ్ల విడి పత్తి, నలుగురు రైతులు ఐదు క్వింటాళ్ల గోనె సంచుల్లో విక్రయానికి తీసుకు వచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం పాట ద్వారా గరిష్ఠ ధర రూ.7 వేలు, కనిష్ఠ ధర రూ.4,500 చెల్లించి కొనుగోళ్ల చేపట్టారు.

డాక్టర్లు, సిబ్బందిపై దాడులు సరికాదు

సుభాష్‌నగర్, మే 6: కోరుట్ల ప్రభుత్వ ఆసుపత్రి డాక్టర్లు, సిబ్బందిపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని ఇలాంటి దాడులు సరికాదని ఉమ్మడి జిల్లా ప్రభుత్వ వైద్యుల సంఘం ప్రతినిధులు అన్నారు. డాక్టర్ ప్రతి రోగిని బతికించాలనే ప్రయత్నిస్తాడని, అందుకు అన్ని రకాల ప్రయత్నాలు చేస్తాడని అన్నారు. అయితే దురదృష్టవశాత్తు రోగి మరణిస్తే దానికి డాక్టర్‌ను బాధ్యుడిని చేయడం సరికాదన్నారు. రోగి బంధువులు విచక్షణ కోల్పోయి డాక్టర్, సిబ్బందిపై డీజిల్‌తో హత్యాయత్నం చేయడం ఆటవిక చర్యగా అభివర్ణించారు. ఆసుపత్రి ఫర్నిచర్‌ను ధ్వంసం చేసి భయానకం సృష్టించడం హేయమైన చర్య అన్నారు. బాధ్యులపై వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకోవాని డిమాండ్ చేశారు.

● దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాం.

కోరుట్లలో ప్రభుత్వ వైద్యుడు, సిబ్బందిపై దాడి చేయడానికి తీవ్రంగా ఖండిస్తున్నామని కరీంనగర్ ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ పొలాస రాంకిరణ్, కార్యదర్శి డాక్టర్ జి వెంకట్‌రెడ్డి, తానా అధ్యక్షుడు డాక్టర్ ఎస్ మహేశ్, కార్యదర్శి డాక్టర్ శ్రీధర్, సీనియర్ వైద్యులు డాక్టర్ బిఎన్ రావు, డాక్టర్ జగన్‌మోహన్‌రావు, డాక్టర్ కిషన్, డాక్టర్ అలీం, డాక్టర్ రాజ్‌కుమార్ అన్నారు. ఈ దాడి అమానుష చర్యగా ఆయన పేర్కొన్నారు. హత్యాయత్నం చేసిన వ్యక్తులను వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని, ధ్వంసం చేసిన ప్రభుత్వ ఆస్తులను వారి నుంచి రికవరీ చేయాలని డిమాండ్ చేశారు.

మద్యం మత్తులో ఇద్దరి మధ్య గొడవ

● అడ్డు వచ్చిన వ్యక్తికి గాయాలు

ముత్తారం మే 6: ముత్తారం మండల కేంద్రంలోని నాగులమ్మ వైన్ షాపులో మద్యం సేవించి మద్యం మత్తులో రెండు వందల కోసం గ్రామానికి చెందిన మారం మల్లారెడ్డి, పింగిలి ప్రభాకర్ రెడ్డి అనే ఇద్దరు గొడవ పడ్డారు. గొడవ తీవ్రతరమై బీరు సీసాలు పగలగొట్టుకుని ఒకరిపై ఒకరు దాడి చేసుకోగా కేషనపల్లి గ్రామానికి చెందిన ఎండి షరీఫ్ వారిని ఆపే ప్రయత్నం చేయగా సీసా షరీఫ్ మెడలో గుచ్చుకుని తీవ్ర గాయాలయ్యాయి. తీవ్ర రక్తస్రావంతో ఉన్న అతనిని చూసి స్థానికులు 108కు ఫోన్ చేసి పెద్దపల్లికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స చేసిన అనంతరం ఉన్నత వైద్యం కోసం వరంగల్ ఎంజీఎం హాస్పిటల్‌కు తరలించారు. బాధితుని పరిస్థితి విషమంగా ఉందని సమాచారం.

ప్రధాని పర్యటనకు పటిష్ట బందోబస్తు

● ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్

వేములవాడ, మే 6: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వేములవాడ పర్యటన సందర్భంగా పటిష్ఠమైన ఏర్పాట్లు చేస్తున్నామని ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. ఈ నెల 8వ తేదీన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వేములవాడలో పర్యటించనున్న నేపథ్యంలో సోమవారం ఆయన పోలీసు అధికారులతో సమావేశం నిర్వహించి ప్రధానమంత్రి కార్యక్రమం సందర్భంగా బందోబస్తు నిర్వహణపై బ్రీఫింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని పర్యటన సందర్భంగా 1200 మంది పోలీస్ అధికారులు, సిబ్బందితో భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామన్నారు. సిబ్బంది అందరూ తమకు కేటాయించిన విధులను పూర్తి అప్రమత్తతో, ఐడి కార్డులను తప్పనిసరిగా ధరిస్తూ విధులు నిర్వహించాలని సూచించారు. హెలికాప్టర్ వద్ద విధులు నిర్వహించేవారు. అలర్ట్‌గా ఉండాలని, హెలికాప్టర్ వద్దకు ఎవరినీ రానివ్వకూడదని సూచించారు. ప్రతి అధికారి బందోబస్తు తనకు కేటాయించిన ప్రాంతంతో పాటు తాను నిర్వర్తించాల్సిన బాధ్యత గురించి పూర్తిగా అవగాహన కలిగి ఉండాలన్నారు. డ్యూటీ ప్రదేశం నుంచి ఎవరు కూడా ఎట్టి పరిస్థితుల్లో వదిలి వెళ్లకూడదని అన్నారు. కార్యక్రమంలో ట్రైనీ ఐపీఎస్ రాహుల్ రెడ్డి, అదనపు ఎస్పీ చంద్రయ్య, డీఎస్పీ నాగేంద్ర చారి, చంద్రశేఖర్ రెడ్డి, వివిధ జిల్లాల నుండి వచ్చిన డీఎస్పీలు, సి.ఐలు ఎస్.ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

రాజ్యాంగం ఉనికికే ప్రమాదం తెస్తున్న బీజేపీ

● రాష్ట్ర ప్రభుత్వాలను కూల్చే కుట్రలు పన్నుతున్న బీజేపీ ● సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె నారాయణ

కరీంనగర్, మే 6(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కేంద్రంలో బీజేపీ మూడోసారి అధికారంలోకి వస్తే రాజ్యాంగం ఉనికికే ప్రమాదం ఏర్పడనుందని సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె నారాయణ అన్నారు. సోమవారం కరీంనగర్‌లోని బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రధాని హోదాలో రాజ్యాంగాన్ని కాపాడాల్సిన వ్యక్తి ఆ రాజ్యాంగంపై ప్రమాణం చేసి దాని ఉనికినే ప్రశ్నార్థకం చేస్తున్నారన్నారు. ముస్లిం రిజర్వేషన్లు రద్దు చేస్తామంటున్నారన్నారు. విదేశాల్లో స్విస్ బ్యాంకు నల్లధనం తిరిగి తెప్పిస్తామని, 15 లక్షల ఖాతాలో జమ చేస్తామని చెప్పిన మోదీ హామీ ఏమైందన్నారు. పది సంవత్సరాల బీజేపీ పాలనలో 29 మంది గుజరాతీలు వేల కోట్లు ఎగవేశారన్నారు. మోదీకి భార్యపిల్లలు లేరని ఎగ్గొట్టిన వారే దత్తపుత్రులన్నారు. 11 వేల కోట్లు తీసుకున్న నీరవ్‌మోదీ ఎలక్టోరల్ బాండ్లకు 30 శాతం కట్టారన్నారు. మోదీ మిత్రుడైన అదానీ గంజాయి స్మగ్లర్ అని వీరిద్దరూ ఒకేసారి పైకి వచ్చారన్నారు. బీజేపీయేతర పార్టీలు పాలిస్తున్న రాష్ట్రాల్లో పార్టీలను చీల్చి, ప్రభుత్వాలను కూల్చేందుకు బీజేపీ కుట్రలు పన్నుతున్నదని నారాయణ ఆరోపించారు. రాష్ట్రంలో సైతం బీజేపీతో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు ప్రమాదముందన్నారు. మహారాష్ట్రలో చేసిన విధంగా పార్టీల్లో చిచ్చులు పెట్టి ప్రభుత్వాలు కూల్చేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. మూడోసారి బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే బీజేపీ తప్ప ఏపార్టీ మనుగడ సాగించ వద్దనే ఆలోచనతో మోదీ ఉన్నారన్నారు. అయోధ్య రామ మందిరాన్ని ఆగమశాస్త్రానికి విరుద్ధంగా ఆదరాబాదరగా ఎన్నికలు సమీపిస్తున్నాయని ప్రారంభించారన్నారని అది అపశకునంగా మారిందన్నారు. దేశంలో రెండో విడత ఎన్నికల్లో బీజేపీకి వ్యతిరేక పవనాలు వీస్తున్నాయన్నారు. ఇండియా కూటమి వస్తే ముస్లింలు దాడులు చేస్తారని ప్రజలను రెచ్చగొడుతున్నారన్నారు. ప్రశ్నించే వారిని సీబీఐ, ఈడీల పేరుతో వేధిస్తున్నారన్నారని, ఢిల్లీ ముఖ్యమంత్రిని జైలు పాలు చేశారన్నారు. మోదీకి వత్తాసు పలికినందుకు పది సంవత్సరాలుగా



మాట్లాడుతున్న సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ

జగన్ మాత్రం బెయిల్‌పైనే ఉన్నాడన్నారు. ప్రస్తుతం బీజేపీయేతర ముఖ్యమంత్రిగా ఉన్న రేవంత్‌రెడ్డిపై వేధింపులు మొదలయ్యాయన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో ఏకగ్రీవంగా ఎంపీలు ఎన్నికవుతున్నారని, పార్లమెంట్ పరిధిలో పది లక్షలకు పైగా ఉన్న ఓటర్ల అభిప్రాయాలకు విలువ లేకుండా పోతోందన్నారు. 400 సీట్లు సాధించి రాజ్యాంగాన్ని మార్చే కుట్రలు పన్నుతున్నారని నారాయణ అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో కేసీఆర్ ప్రభుత్వం అవినీతి, అహంభావంతో ఓడిపోయిందన్నారు. రెండు తెలుగు రాష్ట్రాలకు బీజేపీ ప్రభుత్వం అన్యాయం చేసిందన్నారు. దేశ వ్యాప్తంగా బీజేపీకి అడ్డుకట్ట వేసేందుకే ఇండియా కూటమిలో సీపీఐ భాగస్వామిగా చేరామని, కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపు కోసం సీపీఐ శ్రేణులు పనిచేస్తాయని నారాయణ తెలిపారు. ఈ సమావేశంలో సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి, కలవేన శంకర్, ఉమ్మడి జిల్లా సీపీఐ కార్యదర్శులు మర్రి వెంకటస్వామి పాల్గొన్నారు.

'కేడీసీసీబీ దేశంలోనే అత్యుత్తమ సహకార బ్యాంకు'

కరీంనగర్ టౌన్, మే 6: సహకార అభివృద్ధి నిధుల వినియోగంలో దేశంలోనే అత్యుత్తమ సహకార బ్యాంకుగా ది కరీంనగర్ జిల్లా సహకార కేంద్ర బ్యాంకు లిమిటెడ్ నిలిచిందని నాబార్డు రిటైర్డు చీఫ్ జనరల్ మేనేజర్ డి.రవీంద్ర అభినందించారు. సోమవారం ఆయన సీడీఎఫ్ నిధులు వినియోగంపై అధ్యయనం చేసేందుకు రాష్ట్ర సహకార అపెక్స్ బ్యాంకు లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్.మురళీధర్‌తో కలిసి నగరంలోని డీసీసీబీ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కరీంనగర్ డిసిసిబి సక్సెస్ ఫార్ములాను దేశంలోని అన్ని జిల్లా సహకార కేంద్ర బ్యాంకులు పాటించాలని ఆయన అధికారులకు సూచించారు. కరీంనగర్, నిజామాబాద్, మహబూబ్‌నగర్ జిల్లాల్లో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల అభివృద్ధి కేంద్రం, సిడిఎఫ్ వినియోగంపై అధ్యయనం చేసేందుకు నాబార్డు కమిటీని ఏర్పాటు చేసిందని అన్నారు. టెస్కాబ్ ఎండి మురళీధర్ మాట్లాడుతూదేశంలోనే కేడీసీసీబీ నాలుగు విభాగాల్లో వరుసగా నాఫ్‌స్కాబ్ జాతీయ అవార్డులను కైవసం చేసుకున్నామని తెలిపారు. అన్ని ప్రాథమిక సంఘాలను కంప్యూటరీకరణ చేసిన తొలి సహకార కేంద్ర బ్యాంకు కరీంనగర్‌లేదనని గుర్తు చేశారు. పిడిసి రిసోర్సు పర్సన్ జి. సత్యనారాయణ కేడీసీసీబీ సేవలను కొనియాడారు. ఈ సమావేశంలో డిసిసిబి చైర్మన్ కొండూరు రవీందర్‌రావు, బ్యాంకు సీఈవో ఎన్.సత్యనారాయణరావు, నాబార్డు డిడిఎం జయప్రకాశ్, మనోహర్‌రెడ్డి, దిలీప్, జనరల్ మేనేజర్లు పి.ప్రభాకర్‌రెడ్డి, ఉషశ్రీ, డిజిఎంలు, ఏజీఎంలు తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్‌లో డీజిల్‌కు బదులు పెట్రోల్ ఫిల్లింగ్

రాయికల్, మే 6: డీజిల్ ఫిల్లింగ్ చేసుకోవడానికి వచ్చిన ఓ ట్రాక్టర్‌లో పెట్రోల్ ఫిల్లింగ్ చేసిన సంఘటన రాయికల్ పట్టణంలోని జగిత్యాల రోడ్‌లో ఉన్న శ్రీ వేంకటేశ్వర హెచ్‌పీ పెట్రోల్ బంక్‌లో చోటు చేసుకుంది. బాధిత ట్రాక్టర్ యాజమాని కుర్మ మల్లారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. తన ట్రాక్టర్‌లో డీజిల్‌కు బదులు పెట్రోల్ ఫిల్లింగ్ చేసిన విషయం తనకు తెలియదన్నారు. ఫిల్లింగ్ చేసిన పెట్రోల్‌ను బంక్ సిబ్బంది తొలగించే క్రమంలో సమాచారం రావడంతో బంక్ వద్దకు వెళ్లి చూడగా తన ట్రాక్టర్ నుంచి పెట్రోల్ తొలగించి, స్థానిక ట్రాక్టర్ షో రూం మెకానిక్‌తో రిపేర్ చేయడానికి బంక్ సిబ్బంది ప్రయత్నించారని తెలిపారు. సుమారు 2 గంటల పాటు ట్రాక్టర్ యాజమాని ఆందోళన చేశాడు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీస్ సిబ్బంది ఇరువురికి సర్ది చెప్పే ప్రయత్నం చేసినప్పటికీ ట్రాక్టర్ యాజమాని సంబంధిత అధికారులు స్పందించి నిర్లక్ష్యంగా వ్యవహరించిన బంక్ సిబ్బంది తీరుపై విచారణ జరిపి బంక్‌పై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విషయంపై పెట్రోల్ బంక్ సిబ్బందిని వివరణ కోరగా తాము డీజిల్‌కు బదులు పొరపాటున పెట్రోల్ ఫిల్లింగ్ చేసన విషయం వాస్తవమేనని అంగీకరించారు.

కేసీఆర్‌కు తెలంగాణ పదం ఉచ్చరించే అర్హత లేదు

● టీపీసీసీ అధికార ప్రతినిధి కటకం మృత్యుంజయం

కరీంనగర్ అర్బన్, మే6: తెలంగాణ ఉద్యమపార్టీ, రాజకీయపార్టీ అంటూ తెలంగాణ పదాన్ని బొందపెట్టి బీఆర్ఎస్‌గా మార్చుకున్న కేసీఆర్‌కు తెలంగాణ పదం ఉచ్చరించే అర్హతలేదని మాజీ ఎమ్మెల్యే, టీపీసీసీ అధికారప్రతినిధి కటకం మృత్యుంజయం అన్నారు. డీసీసీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్సీ టి.సంతోష్ కుమార్‌తో కలిసి సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తెలంగాణ ఉద్యమకారులు, కళాకారులు, కవులు, విద్యార్థుల ఉద్యమాలతో 1200మంది ఆత్మ బలిదానాలతో రాష్ట్రం ఏర్పడిందన్నారు. బీఆర్ఎస్ పాలనలో ఎక్కడ చూసినా అవినీతి రాజ్యమేలిందని ఆరోపించారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా కేసీఆర్ అవినీతి పాలనకు కేంద్ర బిందువు అయిందన్నారు. గ్రానైట్, ఇసుక మాఫియాలతో గుట్టలు, వాగులు, నదుల ఆనవాళ్లు లేకుండా చేశారన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత స్థానిక అవసరాలకే ట్రాక్టర్లతో మాత్రమే ఇసుక తీసుకువెళ్లే అవకాశం కల్పించామని మృత్యుంజయం తెలిపారు. కాంగ్రెస్‌కు 8, బీజేపీకి 8, ఎంఐఎంకు ఒక సీటు పంచుకున్నారని హరీశ్‌రావు వాఖ్యలతో బీఆర్ఎస్ పార్టీకి ఏమి సీట్లు రావని చెప్పకనే చెప్పాడన్నారు. కరీంనగర్‌లో తీగల వంతెన, రివర్‌ఫ్రంట్‌లు కట్టమని ఎవరూ అడగలేదని, ఆ నాయకులు, కాంట్రాక్టర్ల కోసమే నిర్మించారని, కోట్ల రూపాయల అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. రాష్ట్రంలో కేసీఆర్ చేసిన అవినీతి పాపాలు నేడు ఈ రాష్ట్రానికి శాపాలుగా మారాయన్నారు. కరీంనగర్‌లోని ఒక రైస్‌మిల్‌లో 600 కోట్ల విలువైన వరిధాన్యం ప్రభుత్వానికి బియ్యం ఇవ్వకుండా అక్కడే పెట్టారని, ఇంతటి అవినీతి జరుగుతున్నా పౌరసరఫరాల శాఖకు తెలియకుండా



మాట్లాడుతున్న టీపీసీసీ అధికార ప్రతినిధి కటకం మృత్యుంజయం

ఉందనేది విడ్డూరంగా ఉందన్నారు. కేంద్రంలో మళ్లీ బీజేపీ ప్రభుత్వం ఏర్పడితే ముస్లిం రిజర్వేషన్లు రద్దు చేస్తామంటున్నారన్నారు. ముస్లింల రిజర్వేషన్లు ఎందుకు రద్దు చేయాలని ఆయన ప్రశ్నించారు. మోదీతో చీకటి ఒప్పందం వల్లనే కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవినీతిపై విచారణ జరిపించ కుండా, కేసీఆర్‌ను జైలుకు పంపించలేదన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌పార్టీకి 13 నుంచి 14 సీట్ల వరకు వస్తాయని, బీజేపీకికి మూడు లేదా నాలుగు సీట్లు రావచ్చని, ఎంఐఎంకు ఒక సీటు వస్తుందని, బీఆర్ఎస్ ఒక్క సీటు కూడా గెలవదన్నారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్, నగర కాంగ్రెస్ అధ్యక్షులు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రిజర్వేషన్లు రద్దు చేసేందుకు బీజేపీ కుట్ర

● ఈనెల 8న రాజ్యాంగ రక్షణ సభ ● పజా సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు గజ్జల కాంతం

సుభాష్‌నగర్, మే6: ఆర్ఎస్ఎస్ మార్గదర్శనంలో రిజర్వేషన్లు, రాజ్యాంగం రద్దుకు బీజేపీ పూనుకోనున్నదని ప్రజా సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు గజ్జల కాంతం ఆరోపించారు. సోమవారం కరీంనగర్‌లోని పద్మనాయక కల్యాణ మండపంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రస్తుత పార్లమెంట్ ఎన్నికల్లో 400 స్థానాలు గెలుపొందడం ద్వారా సులువుగా రాజ్యాంగాన్ని రద్దు పరచవచ్చన్న అంగీకారానికి ఆర్ఎస్ఎస్, బీజేపీలు వచ్చాయన్నారు. అనంతరం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు ఉద్దేశించిన రిజర్వేషన్లను తొలగించేందుకు కుట్ర పన్నుతున్నాయని ఆరోపించారు. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామన్న బీజేపీ ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వలేదన్నారు. దేశ సంపదను అదాని, అంబానీలకు ధారా దత్తం చేశారని విమర్శించారు. రైతులపై నల్ల చట్టాలను తీసుకువచ్చి 750 మంది రైతుల చావులకు కారకులయ్యారని ఆరోపించారు.

● రాజ్యాంగం, రిజర్వేషన్ల రద్దు యోచనను వ్యతిరేకిస్తూ బుధవారం కరీంనగర్‌లోని పద్మనాయక కల్యాణ మండపంలో రాజ్యాంగ రక్షణ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. రాజ్యాం గం, రిజర్వేషన్ల రద్దుకు బీజేపీ, ఆర్ఎస్ఎస్ సంయుక్తంగా చేసిన తీర్మాన ప్రతులు తమ వద్ద ఉన్నాయని, రాజ్యాంగ పరిరక్షణ సభలో బహిర్గతం



సమావేశంలో మాట్లాడుతున్న గజ్జల కాంతం

చేస్తామన్నారు. రాజ్యాంగం రిజర్వేషన్ల రద్దుకు బీఆర్ఎస్ కూడా మద్దతు ఇస్తుందని, అందువల్లనే ఆ పార్టీ అధినేత కేసీఆర్ నోరు మెదపడం లేదని ఆయన ఆరోపించారు. ఈ సమావేశంలో సముద్రాల అజయ్, గజ్జల ఆనందరావు, కోండ్ర స్వరూప, సుద్దాల లక్ష్మన్, గోష్కి శంకర్, కల్లెపల్లి శంకర్, ఆవారు లత, భారతి తదితరులు పాల్గొన్నారు.

అత్యాచారం కేసులో నిందితుడి రిమాండ్

కరీంనగర్ క్రైం, మే 6: కొత్తపల్లి మండలం కమాన్‌పూర్ గ్రామానికి చెందిన ఒక అవివాహిత(39)ని అదే గ్రామానికి చెందిన గువ్వల సత్యం(44) ఏడాదిగా ఆమె ఫోన్‌కు కాల్ చేసి మాట్లాడుతూ వేధిస్తుండేవాడు. గత జులై నెలలో ఆమె ఇంటికి వెళ్లి అత్యాచారం చేశాడని బాధితురాలు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు కరీంనగర్ రూరల్ సీఐ ఎ ప్రదీప్‌కుమార్ తెలిపారు. వీడియోలు తీశానని బ్లాక్‌మెయిల్ చేసినట్లు బాధితురాలు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు నేరస్తుడిని సోమవారం అరెస్టు చేసి కోర్టులో హాజరు పరచగా మెజిస్ట్రేట్ ఆదేశాలతో 14 రోజుల రిమాండ్‌కు తరలించామని సీఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

కరీంనగర్ క్రైం, మే 6 : కరీంనగర్ రూరల్ మండలం ఇరుకుల్ల వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన దుర్శేడ్‌కు చెందిన నేరెళ్ల సంపత్‌కుమార్(43) ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మధ్యాహ్నం మృతి చెందాడని కరీంనగర్ రూరల్ పోలీసులు తెలిపారు. సంపత్‌కుమార్ చేగుర్తిలో పంపు ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడని, ఆదివారం ఒక ఫంక్షన్‌కు వెళ్లి తిరిగి వస్తుండగా ఇరుకుల్ల వద్ద ద్విచక్రవాహనాన్ని యూటర్న్ చేస్తుండగా కారు అతివేగంగా వచ్చి ఢీకొట్టినట్లు తెలిపారు. ఈ ప్రమాదంలో తలకు తీవ్రగాయాలు కాగా స్థానికులు ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందిస్తుండగా మృతి చెందాడని తెలిపారు. మృతుడి భార్య స్వరూప ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

తీగలవంతెన పైనుంచి దూకి గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య

కరీంనగర్ క్రైం, మే 6 : కరీంనగర్ శివారులోని బైపాస్‌రోడ్ వద్ద తీగల వంతెనపై నుంచి కిందకు దూకి గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడని కరీంనగర్ రూరల్ పోలీసులు తెలిపారు. సోమవారం ఉదయం 9:30 గంటల సమయంలో ఒక వ్యక్తి



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

తీగల వంతెనపై నుంచి కిందికి దూకి ఆత్మహత్య చేసుకున్నాడని, అతని వయస్సు 35 నుంచి 40 సంవత్సరాలు ఉంటుందని తెలిపారు. మృతుడి శరీరంపై తెలుపు రంగు చొక్కా, నలుపు రంగు ప్యాంటు ధరించి ఉందని, ఎడమ కన్ను బొమ్మపై భాగంలో గాయానికి సంబంధించి ఏడు కుట్లు వేయబడి ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఈ వ్యక్తికి సంబంధించిన వివరాలు ఎవరికైనా తెలిసినట్లయితే కరీంనగర్ రూరల్ పోలీసు ఠాణాకు వివరాలు తెలుపాలని పోలీసులు కోరారు. మృతుడి వివరాల కోసం ఫోన్: 8712670764, పోలీసు ఠాణా 8331940590లో సంప్రదించాలని కోరారు. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కరీంనగర్ ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలోని మార్చురీలో భద్రపరిచామన్నారు. కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నామని తెలిపారు.

కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి వెలిచాలపై ఎన్నికల కేసు నమోదు

కరీంనగర్ క్రైం, మే 6 : ముందస్తు అనుమతి లేకుండా ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రజలను సమావేశపరిచి స్ట్రీట్ కార్నర్ మీటింగ్ ఏర్పాటు చేసినందుకు కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావుతో పాటు, 7వ డివిజన్ కార్పొరేటర్ భర్త అయిన ఆకుల ప్రకాష్‌పై కేసు నమోదు చేశామని కరీంనగర్ మూడో ఠాణా సీఐ జాన్ రెడ్డి తెలిపారు. లోకసభ ఎన్నికల ప్రచారంలో భాగంగా, సంబంధిత అధికారి నుంచి ఎటువంటి ముందస్తు అనుమతి లేకుండా ఆదివారం ఉదయం హౌసింగ్ బోర్డ్‌కాలనీ లైబ్రరీ ఆవరణలో కొంతమంది ప్రజలను సమావేశపరిచి స్ట్రీట్ కార్నర్ మీటింగ్ ఏర్పాటు చేసి ప్రచారం నిర్వహించి, ఎన్నికల నియమావళి ఉల్లంఘించారని ఫ్లైయింగ్ స్క్వాడ్ ఇంచార్జి, పంచాయతీరాజ్ శాఖ అసిస్టెంట్ ఇంజనీర్ బీ రమణారెడ్డి ఫిర్యాదు ఇచ్చారు. ఈ మేరకు కరీంనగర్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావుతో పాటు, సభ ఏర్పాటు చేసినందుకు ఆకుల ప్రకాష్‌లపై ఎన్నికల నియామావళి ఉల్లంఘన కేసు నమోదు చేసామన్నారు.

వ్యవసాయ పొలాల్లో అగ్ని ప్రమాదం

ఎల్లారెడ్డిపేట, మే 6: ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్, తిమ్మాపూర్, హరిదాస్‌నగర్ గ్రామ శివారుల్లోని వ్యవసాయ పొలాల్లో సోమవారం అగ్ని ప్రమాదాలు జరిగాయి. పొలాల చుట్టూ మంటలు వ్యాపించాయి. ఆయా గ్రామాల్లోని రైతులకు చెందిన పశుగ్రాసం, విద్యుత్తు మోటార్లు, స్టార్టర్లు, సాగు నీటి పైపులు కాలిబూడిదయ్యాయి. రైతులు చేరుకుని మంటలను అదుపు చేయడంతో చుట్టు పక్కల వారు ఊపిరి పీల్చుకున్నారు. ప్రమాదంలో సుమారు రూ.2 లక్షల నష్టం వాటిల్లిందని బాధిత రైతులు పేర్కొన్నారు. తమను ఆదుకోవాలని కోరారు.

● తంగళ్లపల్లి: తంగళ్లపల్లి మండలం బద్దనపల్లి గ్రామంలో విద్యుత్తు షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగి పశుగ్రాసం దగ్ధమైంది. బాధిత రైతు వెంకట్‌రెడ్డి మాట్లడుతూ నాలుగు ఎకరాలలో పశుగ్రాసం కట్టలు కట్టి ఉంచామన్నారు. సోమవారం విద్యుత్తు తీగలు తగిలి మంటలు చెలరేగి గడ్డి కాలి బుడిదయ్యిందని తెలిపాడు. గతంలో సైతం గడ్డి కాలి పోయిందని వైర్లను సరిచేయాలని సెస్ అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు



తిమ్మాపూర్‌లో కాలిపోయిన పశుగ్రాసం

ప్రభుత్వాలు నాణ్యమైన విద్య వైద్యం అందించాలి

● ఓటర్ల చైతన్య యాత్ర కన్వీనర్ ఆకునూరి మురళి

జమ్మికుంట రూరల్, మే 6: ప్రభుత్వాలు నాణ్యమైన విద్య వైద్యం అందించాలని జాగో తెలంగాణ ఓటర్ల చైతన్య యాత్ర కన్వీనర్, మాజీ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి అన్నారు. జాగో తెలంగాణ ఆద్వర్యంలో చేపట్టిన ఓటర్ల చైతన్య యాత్ర సోమవారం జమ్మికుంటకు చేరుకుంది. ఈ సందర్భంగా స్థానిక గాంధీ చౌరస్తాలో ఆయన మాట్లాడుతూ వ్యవసాయం, రైతుల సంక్షేమం, యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉంటుందన్నారు. ఇవి తప్ప బీజేపి ప్రభుత్వం అన్ని చేస్తుందన్నారు. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పారని, పదేళ్లలో 20కోట్ల ఉద్యోగాలు ఇవ్వాల్సి ఉందని, మోదీ ఇచ్చిన ఉద్యోగాలు కరీంనగర్‌లో ఎక్కడైనా కనిపించాయా చెప్పాలన్నారు. నల్ల చట్టాలు తీసుకు వచ్చి వందల మంది రైతుల ప్రాణాలు బలిగొన్నారని గుర్తు చేశారు. పదేళ్ల పాలించి ప్రజలను మోసగించిన బీఆరెస్ పార్టీని తరిమి కొట్టారని, అదేవిధంగా ఇప్పుడు పార్లమెంట్ ఎన్నికల్లో



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆకునూరి మురళి

బీజేపీకి ప్రజలు తగిన బుద్ధి చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఐఏఎస్ అధికారులు పాల్గొన్నారు.

ఎండ తీవ్రత తట్టుకోలేక మహిళ మృతి

శంకరపట్నం, మే 6: మండలంలోని కేశవపట్నం గ్రామంలో ఎండ తీవ్రత తట్టుకోలేక అస్వస్థతకు గురై ఓ మహిళ మృతి చెందింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం కేశవపట్నం గ్రామానికి చెందిన పంజాల భారతి (55) సోమవారం మధ్యాహ్నం ఎండ తీవ్రతతో అస్వస్థతకు గురై ఇంట్లో సొమ్మసిల్లి పడిపోయింది. గమనించిన కుటుంబ సభ్యులు హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరిశీలించి మృతి చెందినట్లు తెలిపారు.

బీ ఫార్మసీ, బీపీఎడ్ పరీక్ష ఫలితాలు విడుదల

గణేశ్‌నగర్, మే6: ఎస్‌యూ పరిధిలోని బీ ఫార్మసీ మొదటి, రెండు, ఏడు, ఎనిమిదో సెమిస్టర్, బీపీఎడ్ మొదటి, మూడో సెమిస్టర్ పరీక్ష ఫలితాలు విడుదల చేసినట్లు ఎస్‌యూ పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎస్‌వి శ్రీరంగప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు.

మీర్జంపేట వాసికి డాక్టరేట్

కాల్వశ్రీరాంపూర్, మే 6: మండలంలోని మీర్జంపేట గ్రామానికి చెందిన ఉయ్యాల బాలకృష్ణ హైదరాబాద్ ఇబ్రహీంపట్నంలోని గురునానక్ విద్యాసంస్థలలో ఫార్మసీ విభాగంలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్నారు. పరిశోధక విద్యార్థిగా ఫైటో కెమికల్స్‌పైన పరిశోధన, ఎంపిక చేయబడిన ఔషధ మొక్కల నుంచి మానసిక ఒత్తిడి తగ్గించేందుకు శక్తి నిర్ధారణ అనే అంశంపై చేసిన పరిశోధనకు గాను అన్నామలై యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్ అవార్డు ప్రదానం చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల వైస్‌చైర్మన్ సర్దార్ గగన్ దీప్ సింగ్ కోహ్లీ, ఎండీ హెచ్‌ఎస్ సైనీ, ముఖ్యఅతిథి ప్రొఫెసర్ అనిల్ డి సహస్ర బుద్ధి, డైరెక్టర్ కె వెంకటరావు, జాయింట్ డైరెక్టర్ పి పార్థసారథి, ప్రిన్సిపాల్ షేక్ హసన్‌రషీద్ బాలకృష్ణను అభినందించారు.

మండలాన్ని సందర్శించిన అధికారులు

పాలకుర్తి, మే 6: మండలం పరిధిలోని కన్నాల అమ్మ ఆదర్శ పాఠశాలను, పోలింగ్ కేంద్రాల ఏర్పాటు తదితర పనులను సోమవారం జిల్లా ప్రజాపరిషత్ కార్యనిర్వాహణ అధికారి నరేందర్ పరిశీలించారు. గ్రామంలో తాగు నీరు సమస్యను తెలుసుకున్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల పనులను త్వరగా పూర్తి చేయాలని గ్రామాల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా చూడాలన్నారు. బసంత్‌నగర్, పాలకుర్తి, ఈసాలతక్కళ్ళపల్లి గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలు, జిల్లా పరిషత్ పాఠశాలను సందర్శించి అక్కడ జరుగు తున్న మరమ్మతు పనులను డీఆర్డీవో రవిందర్ రాథోడ్ పరిశీలించారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సభ్యులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీవో పోల్సాని శశికళ, ఏపీఎం సదానందం పాల్గొన్నారు.

రూ.9 కోట్లతో పోలీస్ క్వార్టర్ల నిర్మాణం

- గోదావరిఖని ఐబీ కాలనీలోని పాత క్వార్టర్ల తొలగింపునకు నిర్ణయం - రెండో విడతలో మరిన్ని నిర్మాణాలు



ఐబీ కాలనీలోని పోలీస్ క్వార్టర్లు

కోల్‌సిటీ, మే 6: రావగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని గోదావరిఖని ఐబీ కాలనీలో తొమ్మిది కోట్ల రూపాయలతో పోలీస్ నివాస భవనాలను నిర్మించనున్నారు. ఈ మేరకు పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో టెండర్ల ప్రక్రియ కూడా పూర్తయ్యింది. ఐబీ కాలనీలో ప్రస్తుతం ఉన్న జీ ప్లస్‌వన్ క్వార్టర్లు శిథిలావస్థలో ఉన్నాయి. పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ పదేళ్ల క్రితమే వీటిని శిథిలావస్థ క్వార్టర్లుగా ప్రకటించింది. వీటిలో పోలీస్ సిబ్బంది, కుటుంబాలు తాత్కాలిక విద్యుత్ కనెక్షన్ తీసుకుని నివాసముంటున్నారు. వీటిని తొలగించి వీటి స్థానంలో కొత్త నిర్మాణాలు జరపనున్నారు.

ఆధునిక వసతులతో ఏడు ఇండిపెండెంట్ భవనాలు, మూడు అంతస్థుల్లో అపా ర్ట్‌మెంట్ మాదిరిగా 12యూనిట్లకు నిర్మాణం జరుపనున్నారు. రామగుండం కమిషనరేట్ కార్యాలయ నిర్మాణంలో భాగంగా కమిషరేట్ హెడ్‌క్వార్టర్ ప్రాంగణంలోని పోలీస్ అధికారులు, సిబ్బంది నివాస భవనాలను తొలగించారు. ప్రస్తుతం కమిషనరేట్‌లో పోలీస్ కమిషనర్‌తో పాటు అదనపు డీసీపీ(అడ్మిన్), ఏఆర్ ఏసీపీ, టాస్క్‌ఫోర్స్, సీసీఎస్, సైబర్ క్రైమ్, ట్రాఫిక్ ఏసీపీలు, రిజర్వు ఇన్‌స్పెక్టర్లు, టాస్క్‌ఫోర్స్ సీసీఎస్, సైబర్ క్రైమ్‌లలో పదుల సంఖ్యలో ఇన్‌స్పెక్టర్లు, ఎస్‌ఐలు విధులు నిర్వహిస్తున్నారు. వీరితో పాటు కమిషనరేట్ కార్యాలయంలో కూడా ఏవో, సూపరింటెండెంట్లు, ఇతర కార్యాలయ సిబ్బంది ఉంటున్నారు. వీరు సింగరేణి క్వార్టర్లలో అద్దె ప్రాతిపదిన నివాసముంటున్నారు. కమిషనరేట్ నిర్మాణ సమయంలోనే పోలీస్ నివాస భవనాలకు నిధులు కేటాయిస్తామని, వివిధ చోట్ల అపార్ట్‌మెంట్ స్థాయిలో టవర్లు నిర్మిస్తామని హౌసింగ్ కార్పొరేషన్ ఉన్నతాధికారులు పేర్కొన్నారు. పోలీస్‌శాఖలో పని చేస్తున్న సిబ్బంది నివాసాలకు సింగరేణి యాజమా న్యం 50ఏళ్ల క్రితం ఐబీ కాలనీలో స్థలం కేటాయించింది. ఆ స్థలంలో గతంలో క్వార్టర్లు నిర్మించారు. వీటి స్థానంలోనే కొత్త భవనాలను నిర్మించనున్నారు.

● క్వార్టర్లను ఖాళీ చేయాలని ఆదేశాలు..

ఐబీ కాలనీ క్వార్టర్లలో నివాసముంటున్న పోలీస్ సిబ్బంది కుటుంబాలు వెంటనే క్వార్టర్లు ఖాళీ చేయాలని పోలీస్ అధికారులు ఆదేశాలు జారీ చేశారు. రికార్డుల ప్రకారం క్వార్టర్లు శిథిలావస్థ జాబితాలో ఉన్నాయి. సిబ్బంది చిన్నచిన్న మరమ్మతులు చేసుకుని ఆ క్వార్టర్లలో నివాసముంటున్నారు. రెండు రోజుల క్రితం క్వార్టర్లను ఖాళీ చేయాలని అధికారులు ఆదేశాలు జారీ చేయడంతో సిబ్బంది కుటుంబాలు ఆందోళనకు గురయ్యాయి. సిబ్బంది ఎన్నికల విధుల్లో ఉండడంతో పాటు కుటుంబాలు సమయం కోరాయి. వారం రోజుల్లో క్వార్టర్లు ఖాళీ చేస్తామని గడువు ఇవ్వాలని కోరారు.

ఈవీఎం కమిషనింగ్‌ను సమర్థవంతంగా పూర్తిచేయాలి

పెద్దపల్లి పార్లమెంటు రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్





ఈవీఎం కమిషనింగ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్, పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ సెంటరును తనిఖీ చేస్తున్న కలెక్టర్

జ్యోతినగర్, మే 6: ఈవీఎం యంత్రాల కమిషనింగ్ ప్రక్రియ సమర్థవంతంగా పూర్తి చేయాలని పెద్దపల్లి పార్లమెంటు రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ఆదేశించారు. సోమవారం ఎన్టీపీసీ టీటీఎస్‌లోని జిల్లా పరిషత్ పాఠశాలలో ఏర్పాటు చేసిన ఈవీఎం యంత్రాల కమిషనింగ్ ప్రక్రియను అదనపు కలెక్టర్ జె.అరుణశ్రీతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్‌వో ముజమ్మిల్ ఖాన్ మాటాడతూ పార్లమెంటు పరిధిలో అదనపు ఈవీఎం బ్యాలెట్ యూనిట్ల ర్యాండమైజేషన్ పూర్తి చేసి, ఈవీఎం యంత్రాల కమిషనింగ్ ప్రక్రియ ప్రారంభించామన్నారు. రామగుండం సెగ్మెంట్ పరిధిలో 269 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, వీటిలో 1001 బ్యాలెట్, 371 కంట్రోల్ యూనిట్లు, 377 వీవీప్యాట్లు కమిషనింగ్ చేయాలని తెలిపారు. ఈవీఎం యాంత్రాలను కమిషనింగ్ చేసే సమయంలో ఈవీఎం, వీవీప్యాట్ల నెంబర్లను ఒకటికి పదిసార్లు పరిశీలించాలని, యంత్రాలకు సీల్ వేసే సమయంలో అ వసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అనంతరం రామగుండం సెగ్మెంట్ పోస్టల్ బ్యాలెట్ ఓటర్ ఫెసిలిటేషన్ కేంద్రాన్ని ఆర్‌వో ముజమ్మిల్ ఖాన్ తనిఖీ చేసి, పోలింగ్ ప్రక్రియను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో రామగుండం తహసిల్దార్ కుమారస్వామి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

మతోన్మాద బీజేపీని చిత్తుగా ఓడించాలి

సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి రాజన్న



సమావేశంలో మాట్లాడుతున్న కె రాజన్న

జ్యోతినగర్, మే 6: మతోన్మాద, ఫాసిస్టు భారతీయ జనతా పార్టీని పార్లమెంట్ ఎన్నికల్లో చిత్తుగా ఓడించాలని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి కె రాజన్న కోరారు. సోమవారం ఐఎఫ్‌టీయూ ఆఫీసులో జరిగిన విలేకరుల సమావేశంలో రాజన్న మాట్లాడుతూ 10 సంవత్సరాల నరేంద్రమోదీ నిరంకుశత్వంతో పాలన కొనసాగించాడని, ప్రజలపై మరింత ఫాసిజాన్ని ప్రదర్శించేందుకు ప్రయత్నిస్తున్నాడని ఆరోపించారు. ప్రజలపై అన్ని వైపుల నుంచి దాడి చేయడానికి అవసరమైన ప్రాతిపదికను మోదీ సిద్ధం చేసుకున్నాడన్నారు. ప్రజా సమస్యలపై పోరాడే సంస్థలు, ఉద్యమాలపై తీవ్రమైన నిర్బంధాన్ని విధించాడని, రానున్న కాలంలో నిర్బంధాన్ని మరింత విస్తృతం చేసేందుకు ప్రయత్నిస్తున్నాడన్నారు. ప్రశ్నించే ప్రతిపక్ష పార్టీలపై రాజ్యాంగబద్ధ సంస్థలను అక్రమంగా ఉపయోగిస్తూ పార్టీలను అణగదొక్కుతున్నాడని ఆరోపించారు. ఉద్యమకారులపై, విప్లవ పార్టీలు, సంస్థలపై ఎన్‌డీఏ సర్కారు ఉపా చట్టాన్ని ప్రయోగిస్తున్నదన్నారు. ప్రతిపక్ష పార్టీల నాయకులపైన ఈడీ, సీబీఐ, ఐటీ సంస్థలతో దాడులు చేయిస్తున్నదని, లొంగని నేతలను జైళ్లకు పంపిస్తున్నదన్నారు. ప్రభుత్వరంగ సంస్థలను కార్పొరేట్ శక్తులకు అప్పగించిందని, రానున్న రోజుల్లో దాన్ని మరింత ఉధృతం చేయాలని మోదీ ప్రయత్నిస్తున్నాడన్నారు. ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను ఓడించే ఇండియా కూటమికి అభ్యర్థులకు సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసి మద్దతునిస్తుందని తెలిపారు. సమావేశంలో పార్టీ నాయకులు ఇ నరేష్, చిలుక శంకర్, చంద్రయ్య, బుచ్చన్న, రాజేశం, వెంకటస్వామి, నర్సయ్య పాల్గొన్నారు.



పని వేళలు సవరించకుంటే ఆందోళనలు

యైటింక్లయిన్‌కాలనీ, మే 6: అధిక ఉష్ణోగ్రతలను దృష్టిలో ఉంచుకుని కార్మికులకు ఇబ్బందిలేకుండా పనివేళలను మార్చాలని సింగరేణి కోల్‌మైన్స్ కార్మిక సంఘ్ ఆర్జీ-2, 3 ఉపాధ్యక్షులు కుమారస్వామి, అరుకుల ప్రసాద్ వేర్వేరు ప్రకటనల్లో డిమాండ్ చేశారు. గతంలో యాజమాన్యం వేసవికాలంలో అమలు చేసిన పనివేళలను ప్రస్తుతం అమలు చేయాలని కోరారు. మొదటి షిఫ్టు ఉదయం 6 నుంచి 11 గంటల వరకు, రెండో షిఫ్టు సాయంత్రం 5 నుంచి 11 గంటల వరకు మార్చితే ఎండల నుంచి కార్మికులకు ఉపశమనం కలుగుతుందని, రెండు రోజుల కిత్రం యాజమాన్యం సర్క్యులర్‌లో పేర్కొన్న పని వేళలతో ఉపయోగం ఉండబోదని తెలిపారు. సాధారణ ఉష్ణోగ్రతలు 46 డిగ్రీలుగా నమోదు అవుతున్నాయని, ఓసీపీల్లో 50 డిగ్రీల వరకు ఉంటుందని, అటువంటి సందర్భాల్లో పనులు చేయించడం నిబంధనలకు విరుద్ధమని వారు పేర్కొన్నారు. యాజమాన్యం ఏకపక్షంగా నిర్ణయం తీసుకోకుండా కార్మికుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని పనివేళలను నిర్ణయించాలని కుమారస్వామి, ప్రసాద్ డిమాండ్ చేశారు.

ఓపెన్‌కాస్టుల్లో పని వేళలు మార్చాలి

బీఎంఎస్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య

రామగిరి, మే 6: ఓపెన్‌కాస్టు ప్రాజెక్టులో పెరిగిపోతున్న ఉష్ణోగ్రత దృష్ట్యా పనివేళలను మార్చాలని బీఎంఎస్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఉదయం ఆరు గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటలు, సాయంత్రం ఐదు గంటల నుంచి రాత్రి 11గంటల వరకు పనివేళలను మార్చాలని కోరారు. దీంతో పాటు మజ్జిగ ప్యాకెట్‌లను పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో బిఎంఎస్ ఎక్షనా ఆందోళన కార్యక్రమాలను చేపడతామని హెచ్చరించారు.

మొదటి విజయం ప్రేరణతో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి

- కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్



విద్యార్థులు, ఉపాధ్యాయులను సన్మానిస్తున్న కలెక్టర్

పెద్దపల్లి కల్చరల్, మే 6: జీవితంలో సాధించిన మొదటి విజయం ప్రేరణతో విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. పదో తరగతి ఫలితాలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను, ఫలితాల సాధనకు కృషి చేసిన ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయలను సోమవారం సమీకృత కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో కలెక్టర్ సన్మానించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన పదో తరగతి ఫలితాల్లో పెద్దపల్లి జిల్లాలో అద్భుతమైన ఫలితాలను సాధించిందన్నారు. జిల్లాలో 7,716 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 7,432 మంది విద్యార్థులు (96.32) ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, వివిధ శాఖల అధికారులు చేసిన కృషితో ఉత్తమ ఫలితాలు సాధించామన్నారు. జీవితంలో పదో తరగతి ఫలితాలు మొదటి మెట్టు మాత్రమేనన్నారు. ఇదే విధంగా భవిష్యత్తులో సైతం క్రమశిక్షణతో వ్యవహరించి మంచి ఫలితాలు సాధించాలని కలెక్టర్ విద్యార్థులకు సూచించారు. 10/10 జీపీఏ సాధించిన ఆరుగురు ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు, 18 మంది ప్రభుత్వ రెసిడెన్షియల్ గురుకుల పాఠశాల విద్యార్థులను, ఉపాధ్యాయులను, అధికారులను కలెక్టర్ సన్మానించారు. గుజరాత్ వాదనగర్‌లో జరిగే జాతీయ స్థాయి ప్రేరణ శిక్షణకు పెద్దపల్లి జిల్లా నుంచి ఎంపికైన అప్పన్నపేట్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి మొహమ్మద్ అలీ రిషన్, ఓదెల మండలం తెలంగాణ మోడల్ స్కూల్ విద్యార్థిని పరిశే అభిజ్ఞను సన్మానించారు. కార్యక్రమంలో డీఈవో డి మాధవి, పాఠశాల అకాడమిక్ అధికారి పీఎం. షేక్, జిల్లా బీసీ అభివృద్ధి అధికారి రంగారెడ్డి, జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి మేరాజ్ మహమూద్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రిక్షా తొక్కుతూ.. ఓట్లు అభ్యర్థిస్తూ..

- పెద్దపల్లి బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి 'కొప్పుల' ప్రచారం



రిక్షా తొక్కుతున్న కొప్పుల ఈశ్వర్

గోదావరిఖని, మే 6: ఎన్నికల ప్రచారాల్లో అభ్యర్థులు ప్రజలను ఆకర్షించేందుకు వినూత్నమైన రీతులను ఎంచుకుంటున్నారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ సోమవారం గోదావరిఖనిలో తోపుడు రిక్షా తొక్కుతూ ప్రచారం నిర్వహించారు. బీఆర్‌ఎస్ నాయకుడు తోట వేణు తోడుపు రిక్షాలను ప్రచార రథాలుగా ఏర్పాటు చేశాడు. వీటిని ప్రారంభించేందుకు వచ్చిన ఈశ్వర్ గోదావరిఖని బస్టాండ్ ఏరియాలో రిక్షాలు తొక్కుతూ ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ కూడా పాల్గొని రిక్షా సైకిల్ తొక్కాడు. పలువురు ఈ సన్నివేశాన్ని ఆసక్తిగా తిలకించారు.

వంశీకృష్ణకు మద్దతుగా ప్రచారం

యైటింక్లయిన్‌కాలనీ/మంథని/ముత్తారం/రామగిరి/పెద్దపల్లి రూరల్/దర్మారం, మే 6: పెద్దపల్లి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణకు మద్దతుగా సోమవారం పార్టీ శ్రేణులు ఇంటింటి ప్రచారం చేశారు. ఉపాధి హామీ కూలీలకు మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ అభ్యర్థిని గెలిపించాలి

గోదావరిఖని/పెద్దపల్లిరూరల్/సుల్తానాబాద్/ధర్మారం/కాల్వశ్రీరాంపూర్/ మే 6: కార్మికుల కష్టసుఖాలు తెలిసిన కొప్పుల ఈశ్వర్‌ను గెలిపించండని టీబీజీకేఎస్ నాయకులు సోమవారం ఆర్జీ-1 ఏరియా వర్క్‌షాప్‌లో ప్రచారం నిర్వహించారు. ధర్మారం మండలం నర్సింగాపూర్‌లో కొప్పుల ఈశ్వర్ కూతురు నందిని ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కారు గుర్తుకు ఓటువేసి కొప్పుల ఈశ్వర్‌ను గెలిపించాలని కోరారు.

'ప్రేరణ'కు మోడల్ స్కూల్ విద్యార్థి ఎంపిక

ఓదెల, మే 6: ఈ నెలలో గుజరాత్‌లో నిర్వహించనున్న ప్రేరణ జాతీయ వర్క్ షాప్ కార్యక్రమానికి ఓదెల మోడల్ స్కూల్ విద్యార్థి అభిజ్ఞ ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ మహమ్మద్ జావేద్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థి ఎంపికపై ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

బీజేపీ, బీఆర్‌ఎస్‌లను ఓడిద్దాం.. కాంగ్రెస్‌కు పట్టం కడదాం

- ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ మక్కాన్‌సింగ్



బసంత్‌నగర్‌లో ఉపాధిహామీ కూలీలతో మాట్లాడుతున్న మక్కాన్ సింగ్

పాలకుర్తి, మే 6: రానున్న పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలను ఓడించి ప్రజా ఆస్తులను, ప్రజాస్వామ్యాన్ని కాపాడుదామని, ప్రజాపాలనను ప్రజలకు అందిస్తున్న కాంగ్రెస్ పార్టీకి పట్టం కడదామని రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ మక్కాన్ సింగ్ అన్నారు. సోమవారం పాలకుర్తి, బసంత్‌నగర్ గ్రామాల్లో ఉపాధిహామీ కూలీలను కలుసుకొని పెద్దపల్లి పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఆయన సతీమణి మనాలి ఠాకూర్, మండల అధ్యక్షుడు ముక్కెర శ్రీనివాస్‌గౌడ్, పుట్నూర్, పాలకుర్తి, బసంత్‌నగర్ ఎంపీటీసీలు గంగాధరి రమేష్ గౌడ్, దుర్గం కుమార్, పాత భాగ్యలక్ష్మి రవీందర్, మాజీ సర్పంచ్‌లు పర్షవేణి శ్రీనివాస్, దుర్గం జగన్, కేశోరాం యూనియన్ నాయకులు బయ్యపు మనోహర్ రెడ్డి, నూర సమ్మయ్య పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో మైనార్టీల చేరికలు

గోదావరిఖని: రామగుండం కార్పొరేషన్ పరిధిలోని 40వ డివిజన్ ప్రాంతానికి చెందిన ముస్లీం నాయకులు, యువకులు భారీ సంఖ్యలో సోమవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ వారందరిని కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారు. మైనార్టీ నాయకులు వాహిద్‌బేగ్, యాకూబ్‌ల నాయకత్వంలో సుమారు వంద మంది కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ చేరికల సందర్భంగా ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే ఆరు గ్యారంటీల్లో ఐదు గ్యారంటీలు అమలు చేశామని చెప్పారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణను భారీ మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు. కాంగ్రెస్ గెలుపు కోసం ప్రతి కార్యకర్త కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్పొరేటర్లు, 49వ డివిజన్ అశోక్‌నగర్ హజ్ కమిటీ నాయకులు, కార్పొరేటర్ సనా ఫకృద్దీన్, డివిజన్ అధ్యక్షుడు రియాజుద్దీన్, బొంతల రాజేష్, మహంకాళి స్వామి పాల్గొన్నారు.

స్వర్ణకారుల సమస్యల పరిష్కారానికి కృషి

ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్

కోల్‌సిటీటౌన్, మే 6: రామగుండం కార్పొరేషన్ పరిధిలోని స్వర్ణకారుల సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తానని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్‌ఠాకూర్ హామీ ఇచ్చారు. సోమవారం గోదావరిఖని దుర్గానగర్‌లోని ఓ ప్రైవేట్ ఫంక్షన్‌హాల్‌లో రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ ఏరియా స్వర్ణకార సంఘం నూతన కమిటీ ప్రమాణ స్వీకారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్‌ఠాకూర్ మాట్లాడారు. నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు. స్వర్ణకారుల అభివృద్ధికి పూర్తిస్థాయిలో సహాయ సహకారులు ఉంటాయన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణకు ఓటువేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. అనంతరం నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడు కొండపర్తి నరహరి, ప్రధాన కార్యదర్శి కట్ట నాగేష్, గౌరవ అధ్యక్షులు సామ సత్యనారాయణ ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్పొరేటర్లు, స్వర్ణకార సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఈసెట్

రామగిరి, మే 6: తెలంగాణ స్టేట్ ఈసెట్ ప్రవేశ పరీక్ష సోమవారం మంథని జేఎన్టీయూ కళాశాలలో ప్రశాంతంగా ముగిసింది. పరీక్షకు హాజరైన విద్యార్థులను తనిఖీలు చేపట్టి హాల్‌లోకి అనుమతించారు. పరీక్షకు 150 మంది విద్యార్థులకు గాను ఇద్దరు విద్యార్థులు గైర్హాజరు అయ్యారు. 148 మంది పరీక్ష రాసినట్లు ప్రిన్సిపాల్ చెరుకు శ్రీధర్‌రెడ్డి తెలిపారు. రామగిరి పోలీసుల బందోబస్తు మధ్య ప్రవేశపరీక్ష సజావుగా సాగింది.

ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలి

పెద్దపల్లిటౌన్, మే 6: అర్హులైన ప్రతీఒక్కరు ఓటు హక్కు వినియోగించుకోవాలని ఏసీపీ గజ్జి కృష్ణ పిలుపునిచారు. ఈ సందర్భంగా పెద్దపల్లి జిల్లా పెద్దపల్లి సబ్ డివిజన్ పోలీసు అధికారులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. పెద్దపల్లి ఏసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కును పెద్దపల్లి ఏసీపీతో సీఐ కృష్ణ, సుల్తానాబాద్ సీఐ సుబ్బారెడ్డి, ఎస్‌ఐలు లక్ష్మణ్, మల్లేష్, ఓంకార్ యాదవ్, శ్రీధర్, సత్యనారాయణ వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో విధులు నిర్వర్తించే పోలీసు సిబ్బంది ప్రతి తమ బాధ్యతగా పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు.

ఓఆర్‌ఎస్ ప్యాకెట్ల పంపిణీ

ఓదెల, మే 6: పార్లమెంట్ ఎన్నికల బందోబస్తుకు వచ్చిన భద్రత బలగాలకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది, హెల్త్ అసిస్టెంట్ విద్యాసాగర్ సోమవారం గుంపుల తనిఖీ కేంద్రం వద్ద ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఎండలు తీవ్రంగా మండుతున్న నేపథ్యంలో వైద్యాధికారి సహబేజ్ ఖాన్ ఆదేశం మేరకు విధులు నిర్వహిస్తున్న పోలీస్ బలగాలకు, అలాగే ఇతర ఎన్నికల సిబ్బందికి ఓఆర్‌ఎస్ పాకెట్లు అందుబాటులో ఉన్నాయని సిబ్బంది తెలిపారు. తీవ్రమైన ఎండలను తట్టుకోవడానికి నీటిని అధికంగా తాగాలని, అలాగే ఎక్కువ సమయం చెట్ల నీడలో గడపాలని వైద్యాధికారి జాగ్రత్తలను సూచించారు

ప్రచార ఖర్చుల వివరాలు నమోదు చేయాలి

పెద్దపల్లిటౌన్, మే 6: ఎన్నికల ప్రచారం నిమిత్తం వినియోగించే ప్రతి ఖర్చు వివరాలను అభ్యర్థులు తమకు అందించిన రిజిస్టర్లలో పకడ్బందీగా నమోదు చేయాలని పెద్దపల్లి ఎన్నికల వ్యయ పరిశీలకులు సమీర్ నైరంతర్యా సూచించారు. సోమవారం సమీర్ నైరంతర్యా సమీకృత జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఎన్నికల ఖర్చుల నమోదు అంశంపై అభ్యర్థులతో రెండోదశ సమావేశం నిర్వహించిన అనంతరం ఆయన మాట్లాడారు. ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం ఎన్నికల ప్రచార నిమిత్తం వినియోగించే ప్రతి ఖర్చు వివరాలను అభ్యర్థులు తమకు అందించిన రిజిస్టర్లలో నమోదు చేయాలన్నారు

సమస్యలపై అవగాహన ఉన్నవారినే గెలిపించాలి

మంథని, మే 6: సమస్యలపై అవగాహన, ప్రాంతంపై పట్టు ఉన్నోళ్లకు అవకాశం కల్పిస్తే అభివృద్ధి చేస్తారని పెద్దపల్లి పార్లమెంట్ స్వతంత్ర అభ్యర్థి ప్రొ. నతానియల్ అన్నారు. సోమవారం పట్టణంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. తాను పెద్దపల్లి జిల్లా ఓదెల మండలం కొలనూర్ వాసినని తెలిపారు. ఇక్కడే పుట్టి ఇక్కడే పెరిగిన తాను ఈ ప్రాంతంలో ఉపాధ్యాయుడిగా హెచ్‌ఎం, మండల విద్యాధికారిగా సేవలు అందించానని తెలిపారు. ప్రజాసేవ చేయాలని, ఈ ప్రాంతాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లాలనే ఆకాంక్షతో పెద్దపల్లి పార్లమెంట్ స్వతంత్ర అభ్యర్థిగా బరిలో ఉన్నట్లు తెలిపారు. తనకు పెద్దపల్లి ఎంపీగా అవకాశం కల్పిస్తే అనేక అభివృద్ధి సేవలు అందిస్తానన్నారు. సమావేశంలో రెడ్డి సంఘం అధ్యక్షుడు కర్రె మహేందర్‌రెడ్డి, వాసాల జాన్, ఈర్ల సదానందంతో పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన మాజీ ఎంపీటీసీ

ముత్తారం మే 6: మండలంలోని మైదంబండ గ్రామపంచాయతీ మాజీ ఎంపీటీసీ చెల్కల లింగభవాని సుధీర్ తన అనుచరులతో కలిసి ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సమక్షంలో బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరారు. సోమవారం ఈ మేరకు మంత్రి శ్రీధర్‌బాబు సొంత గ్రామం ధన్వాడలో కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి వారిని ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అందిస్తున్న జనరంజక పాలనకు ఆకర్షితులమయ్యామని అభివృద్ధిలో తమ వంతు కృషి చేయడానికి కాంగ్రెస్ పార్టీలోకి వచ్చామని రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలిపే లక్ష్యంగా పనిచేస్తామని అన్నారు. మాజీ ఎంపీటీసీ చెల్కల లింగ భవాని సుధీర్ వెంట ఆయన అనుచరులు పోతారం గ్రామం వడ్డెర సంఘం నాయకులు ఉప్పు కుమార్, ఒల్లెపు మొగిలి, చింతల మొగిలి, బండ ఓదెలు, జంగపల్లి రవి, చల్ల కనుకయ్య తదితరులు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు చొప్పరి సదానందం, మాజీ జడ్పీటీసీ నాగినేని జగన్మోహన్‌రావు, ముత్తారం మండల అధ్యక్షుడు దొడ్డ బాలాజీ, పలువురు నాయకులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం

కాల్వశ్రీరాంపూర్, మే 6: మండల కేంద్రానికి చెందిన గడ్డం భూమయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా వారి కుటుంబానికి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు రూ.10వేల పంపించగా సోమవారం మాజీ ఎంపీపీ గోపగోని సారయ్యగౌడ్, కాంగ్రెస్ నాయకులు పరామర్శించి డబ్బులు అందజేశారు. అలాగే గ్రామానికి చెందిన అవునూరి పవన్ అనే బాలుడు క్యాన్సర్‌తో బాధపడుతుండగా పరామర్శించి ఆర్థిక సాయం చేశారు. ఏనుగంటి నవీన్ అనేక కాంగ్రెస్ కార్యకర్త రోడ్డు ప్రమాదంలో గాయపడిగా వైద్య ఖర్చులు నిమిత్తం రూ.10 వేలు అందజేశారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ గోపగోని సారయ్యగౌడ్ మాట్లాడుతూ వివిధ కారణాలతో బాధపడుతున్న నిరుపేదలకు అండగా పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అండగా నిలుస్తున్నారన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్, మండల అధ్యక్షుడు సదయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి పులి ఇంద్రకరణ్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల యూత్ అధ్యక్షులు శివరామకృష్ణ, ఉన్నారు.

కాంగ్రెస్ మోసపూరిత హామీలను ప్రజలకు వివరించాలి

మంథని, మే 6: ప్రస్తుత మంత్రి శ్రీధర్‌బాబు చేస్తున్న అక్రమాలను ప్రజలకు తెలిసేలా వివరించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు చంద్రుపట్ల సునీల్‌రెడ్డి, పార్లమెంట్ ఎన్నికల ఇంచార్జిలు నరేందర్‌రెడ్డి, రమేష్, సుహాసిని అన్నారు. ఆదివారం వారు విలేకరులతో మాట్లాడుతూ.. అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ఈ కాంగ్రెస్ నాయకుల గురుంచి ప్రజలకు తెలపాలన్నారు. కాంగ్రెస్ పార్టీ మ్యానిఫెస్టో కమిటీ చైర్మన్ శ్రీధర్ బాబు వల్లనే ఈరోజు ప్రజలు అవస్థలు పడుతున్నారన్నారు. ప్రజలకు ఉచిత హామీల ఆశా చూపి తెలంగాణలో అధికారంలోకి వచ్చారన్నారు. ప్రధాని మోదీ పాలనలో దేశం సస్యశ్యామలంగా ఉంటుందని ప్రతి ఒక్క ఓటరుకు చేరేలా ఇంటి, ఇంటికి ప్రచారం చేయాలన్నారు. నరేంద్ర మోదీని మూడోసారి ముచ్చటగా గెలిపించాలని ప్రజలకు వివరించాలన్నారు. కార్యక్రమంలో పార్లమెంట్ కన్వీనర్ వెంకటేష్, నేతలు కపోతరవేన క్రాంతికుమార్, నాంపెల్లి రమేష్, చిలువేరి సతీష్‌కుమార్, సత్యప్రకాష్, నారాయణరెడ్డి, మల్కా మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

రైలు కింద పడి గుర్తు తెలియని వృద్ధుడి ఆత్మహత్య

ఓదెల, మే 6: మండలంలోని పొత్కపల్లి మానేరు రైల్వే వంతెన మధ్య గొల్లపల్లి శివారులో రైలు కిందపడి సోమవారం గుర్తు తెలియని అరవై ఏళ్ల వృద్ధుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడని రామగుండం జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ తిరుపతి తెలిపారు. మధ్యాహ్నం రైల్వే లైన్ల మధ్య 318 బై 41-39 కిలో మీటర్ల స్తంభం వద్ద మేన్ రైల్వే లైన్‌లో వస్తున్న గూడ్స్ రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడని తెలిపారు. మృతుని వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదని, ఆరేంజ్, బ్లాక్ అండ్ వైట్ చెక్స్ ఫుల్ చొక్కా డిజైన్ లుంగీ ధరించి ఉన్నాడని తెలిపారు. మృతదేహాన్ని జమ్మికుంట ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీలో భద్రపరిచినట్లు వివరాల కోసం 99493304574 నంబర్‌కు ఫోన్ చేసి తెలుసుకోవాలని కోరారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ తిరుపతి తెలిపారు.